దారు శిల్పులకు ఎర్రచందనం

20 కిలోల్లోపు విక్రయాలకు అనుమతి

రూ.200 కోట్లతో శ్రీకాళహస్తి-తడ సిక్స్‌లేన్ రోడ్డు

నాగలాపురం-చినపాండూరు రోడ్డు విస్తరణ

కలెక్టర్ ప్రతిపాదనలకు సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్

టీటీడీపై అసత్య ప్రచారాల పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశం

తిరుపతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గోదాముల్లో వేల టన్నుల కొద్దీ మూలుగుతున్న ఎర్రచందనం దుంగలను దారు శిల్పులకు విక్రయించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఎర్రచందనంతో శ్రీవారి విగ్రహాలు చెక్కించి వాటిని విక్రయించేందుకు పరిమితం చేయనుంది. అమరావతిలో జరుగుతున్న 4వ కలెక్టర్ల కాన్ఫరెన్సులో భాగంగా రెండో రోజైన రోజైన మంగళవారం కలెక్టర్ వెంకటేశ్వర్ చేసిన ప్రతిపాదనలకు సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ సదస్సులో ఎస్పీ సుబ్బరాయుడు కూడా పాల్గొన్నారు. శ్రీకాళహస్తి ప్రాంతంలో చెక్క బొమ్మల తయారీకి పేరుమోసిన దారు శిల్పులున్న సంగతి తెలిసిందే. వారికి 20 కిలోలు మించకుండా ఎర్రచందనం దుంగలు విక్రయించాలని, వీటితో శ్రీవారి విగ్రహాలు తయారు చేయించి తిరుపతి విమానాశ్రయంలో విక్రయాలకు పెట్టాలని కలెక్టర్ ప్రతిపాదించారు. ఇదంతా ప్రభుత్వ అధ్వర్యంలోనే జరిగేలా చూడాలని ప్రతిపాదించగా సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.



కాన్ఫరెన్సులో పాల్గొన్న ఎస్పీ సుబ్బరాయుడు, కలెక్టర్ వెంకటేశ్వర్

- శ్రీకాళహస్తి నుంచీ శ్రీసిటీ మీదుగా తడ వరకున్న డబుల్ రోడ్డును సిక్స్ లేన్‌గా మార్చాలని గతంలోనే సీఎం చంద్రబాబు ఆదేశించారు. డీపీఆర్ తయారీ క్రమంలో సర్వే జరపడంతో భూసేకరణ సమస్య, కొండలు అడ్డుగా వస్తాయని తేలడంతో ఈ ప్రతిపాదన ముందుకు కదల్లేదు. ఇందులో కొన్ని మార్పుచేర్పులతో పాటు నిర్మాణ వ్యయం ప్రభుత్వంపై పడకుండా ఓ ప్రతిపాదనను కలెక్టర్ నివేదించారు. రూ. 200 కోట్ల అంచనా వ్యయంతో రోడ్డు నిర్మించేందుకు సీఎం వెంటనే అంగీకారం తెలిపారు.
- శ్రీసిటీ నుంచీ తడ మీదుగా కాకుండా నాగలాపురం మీదుగా ప్రత్యామ్నాయ రోడ్డును అభివృద్ధి చేయాలని కలెక్టర్ సీఎంకు నివేదించారు. రోడ్డు ప్రమాదాలతో పాటు అత్యవసర సమయాల్లో ఇది అందుబాటులో ఉంటుంది. సత్యవేడు, వరదయ్యపాలెం మండలాల మధ్య వున్న చిన పాండూరు ప్రాంతం శ్రీసిటీకి చేరువగా వుండడంతో పాటు ఏపీఐఐసీకి చెందిన పారిశ్రామిక వాడలకు కూడా సమీపంలో వుంది. పరిశ్రమలు అధికంగా వెలుస్తున్నందున నాగలాపురం మీదుగా చెన్నైకి రాకపోకలు సాగించడానికి ప్రస్తుతమున్న రోడ్డు ఉపయోగపడదు. దాన్ని విస్తరిస్తే బహుళ ప్రయోజనాలుంటాయని కలెక్టర్ చేసిన ప్రతిపాదనకు సీఎం చంద్రబాబు అంగీకారం తెలిపారు.

సేవా రంగంలో జిల్లాకు "ఏ" గ్రేడ్

సేవా రంగంలో ప్రభుత్వం నిర్దేశించిన స్కోర్ బోర్డులో తిరుపతి జిల్లాకు ఏ గ్రేడ్ లభించింది. రాష్ట్రంలో 82 పాయింట్లతో జిల్లా 13వ స్థానంలో నిలిచింది. వార్షిక జీవీఏ లక్ష్యం రూ. 37,191 కోట్లు కాగా తొలి త్రైమాసికంలో రూ. 8234 కోట్లు సాధించింది. రాయలసీమలో నంద్యాల, అనంతపురం జిల్లాలు మాత్రమే తిరుపతి కంటే ముందున్నాయి. జీవీఏ లక్ష్య సాధనలో జిల్లా 15వ స్థానంలో ఉంది.

టీటీడీపై వైసీపీ పెయిడ్ బ్యాచ్ దుష్ప్రచారాన్ని అడ్డుకోండి!

తిరుమలలో ప్రతి చిన్న విషయాన్నీ వైసీపీ పెయిడ్ బ్యాచ్ ప్రపంచవ్యాప్తంగా తప్పుడు ప్రచారం చేస్తోందని సీఎం చంద్రబాబు కలెక్టర్ల కాన్ఫరెన్సులో ఆరోపించారు. తిరుమల ఆలయంపై, దేవస్థానంపై దుష్ప్రచారాన్ని ఎంతమాత్రం అనుమతించరాదని స్పష్టం చేశారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వుండి నిజానిజాలు ప్రజలకు తెలపాలని ఆదేశించారు. శాంతి భద్రతల గురించి ప్రజల్లో మరింత చైతన్యం తేవాలని, గంజాయి స్మగ్లింగ్, వినియోగం అరికట్టేలా మరింత దృష్టి సారించాలని ఆదేశించారు.

పది క్లస్టర్లలో పెట్టుబడులకు అవకాశం

జిల్లాల్లో భారీ పెట్టుబడులకు అవకాశమున్న క్లస్టర్లను గుర్తించాలని సీఎం ఆదేశించారు. ఉదాహరణకు తిరుపతి జిల్లాలో పది క్లస్టర్లు ఏర్పాటు చేయడానికి తగిన వనరులు ఉన్నాయన్నారు. పరిశ్రమలకు, మౌళిక సదుపాయాలపై పెట్టుబడులు రాబట్టడానికి ప్రయత్నించాలన్నారు. అన్ని క్లస్టర్లలో ఇండస్ట్రియల్ టౌన్‌షిప్ మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు ప్రయత్నించాలని, అందులో వాణిజ్య, నివాస, పారిశ్రామిక, వినోదాత్మక అంశాలుండాలని స్పష్టం చేశారు. మాస్టర్ ప్లాన్‌లో ఆయా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను భాగస్వాములను చేయాలని సూచించారు. టూరిజం కోసం తిరుపతిలో 120 ఎకరాల వ్యూహాత్మక భూమిని కలెక్టర్ గుర్తించారంటూ ప్రస్తావించారు. అలాగే వంద పారిశ్రామిక పార్కుల కార్యక్రమం కింద డీపీఐఐటీకి ప్రతిపాదించిన ల్యాండ్ పార్శిల్స్ విషయానికొస్తే జిల్లాలో షిప్ బిల్డింగ్ రంగానికి దుగరాజపట్నం వద్ద, స్పేస్ సిటీ కోసం రౌతు సూరమాల వద్ద, మల్టీ ప్రొడక్ట్ పరిశ్రమల కోసం శ్రీసిటీ వద్ద భూములు గుర్తించిన విషయం కూడా కాన్ఫరెన్సులో ప్రస్తావనకు వచ్చింది.

భూమన.. బూమరాంగ్



టీటీడీపై దుష్ప్రచారాలను వైసీపీ నేతలు తారస్థాయికి చేరుస్తున్నారు.ఇటీవల పదేపదే ఆరోపణలతో హోరెత్తిస్తున్న టీటీడీ మాజీ చైర్మన్ కరుణాకర రెడ్డి తాజాగా అలిపిరి పాత చెక్‌పోస్టు సమీపంలో పడేసిన విగ్రహాన్ని చూపిస్తూ మహావిష్ణువుకు ఘోర అపచారం జరిగిపోయిందంటూ ఆరోపణలకు దిగారు.అసలా విగ్రహం విష్ణువుదే కాదని, తయారీ సందర్భంగా పాడవడంతో పడేసిన శనీశ్వరుడి విగ్రహమని టీటీడీ వర్గాలతో పాటు విగ్రహ తయారీదారు కుమారుడూ వివరణ ఇచ్చారు.అంతేకాదు టీటీడీ చైర్మన్‌గా పనిచేసినప్పుడు ఆ విగ్రహం కనిపించలేదా అంటూ టీడీపీ నేతలు ప్రత్యారోపణలకు దిగారు. టీటీడీపై కరుణ బరితెగింపు ధోరణి చివరకు బూమరాంగ్ అయిందన్న వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి.

8

సైబర్ వలకు చిక్కిన యోగా మాస్టర్

- ట్రేడింగ్ యాప్‌లతో రూ.11.99 లక్షలు పోగొట్టుకున్న వైనం

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఫేక్ ట్రేడింగ్ యాప్ లింకు పంపారు. పెట్టుబడి పెడితే ఆదాయం వస్తుందని నమ్మించారు. ఇలా ఓ యోగా మాస్టర్ నుంచి రూ.11.99 లక్షలను సైబర్ నేరగాళ్లు కాజేశారు. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. తిరుపతి రూరల్ మండలంలోని ఓ యోగా మాస్టర్ సెల్‌ఫోనుకు గత నెలలో హేమంగి డేట్ అనే వ్యక్తి వాట్సాప్ ద్వారా టీకేఇన్-స్విప్1.కామ్ అనే లింకు పంపాడు. ఐసీఐసీఐ సెక్యూరిటీస్‌కు సంబంధించిన ఈ ట్రేడింగ్ యాప్‌లో పెట్టుబడి పెడితే అధిక మొత్తంలో ఆదాయం వస్తుందని నమ్మించాడు. వారి మాయ మాటలు నమ్మిన ఆయన రూ.11.99 లక్షలను ఆ యాప్‌లో పెట్టుబడి పెట్టారు. ఆ ట్రేడింగ్ యాప్‌లోని యోగా మాస్టారు వ్యాలెట్‌లో మొదట్లో కొంత లాభం చూపించారు. ఆ తర్వాత ఆయన పెట్టుబడి రూ.26,41,304 అయినట్లు చూపించారు. దీనిని విత్‌డ్రా చేసుకోవాలంటే దీనిపై 20 శాతం కమీషన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. దీనిపై అనుమానంతో ఆయన ఐసీఐసీఐ బ్యాంకు అధికారులను సంప్రదించగా.. అది ఫేక్ యాప్ అని తేల్చారు. దీనిపై బాధితుడు 1930కు ఫోన్ చేసి తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఐటీ యాక్టు కింద కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

లా అడ్మిషన్ల గడువు పొడిగింపు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): లా మొదటి దశ కన్వీనర్ కోటా అడ్మిషన్ల గడువును పొడిగించారు. రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపునకు 18వ తేదీ, వెబ్ ఆప్షన్ల ఎంట్రీకి 19, వెబ్ ఆప్షన్లలో మార్పులకు 20, సీట్ల కేటాయింపు 22వ తేదీగా నిర్ణయించారు. 22 నుంచీ 24వ తేదీ లోపు కాలేజీల్లో విద్యార్థులు రిపోర్ట్ చేయాలి.24 నుంచీ క్లాసులు ప్రారంభమవుతాయని కన్వీనర్ సీతాకుమారి తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో భక్తుల భద్రత ముఖ్యం

● ఆర్టీసీ డ్రైవర్లతో ట్రాఫిక్ సీఐ


డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ హరిప్రసాద్

తిరుమల, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): భక్తుల భద్రతను దృష్టిలో పెట్టుకుని బస్సులను నడపాలని ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్ ఆర్టీసీ డ్రైవర్లకు సూచించారు. బ్రహ్మోత్సవాల్లో భక్తుల సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ అధికారులు, డ్రైవర్లతో ట్రాఫిక్ సీఐ మంగళవారం తిరుమల ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సమావేశమయ్యారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. భక్తులతో డ్రైవర్లు మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ మద్యం తాగి డ్రైవింగ్ చేయకూడదన్నారు. అతివేగంతో నడపరాదన్నారు. బస్సులు ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. నిబంధనల ప్రకారమే బస్సులను ఆయా మార్గాల్లో నడపాలన్నారు. వాటర్‌బాటిళ్లు, కూరగాయలు, కూల్‌డ్రింగ్స్ తీసుకువచ్చే వ్యక్తులతో కూడా సమావేశమై పలు సూచనలు చేశారు.

ప్రణాళిక ఆచరణతో లక్ష్యసాధన

●వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ రమణ


విద్యార్థులతో వీసీ జేవీరమణ, డెయిరీడీన్ నాగేశ్వరరావు తదితరులు

తిరుపతిరూరల్, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): లక్ష్యాలను నిర్దేశించుకుని సరైన ప్రణాళికలను ఆచరించడం ద్వారా విజయాలను సాధించవచ్చని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జేవీ రమణ పేర్కొన్నారు. డెయిరీటెక్నాలజీ కళాశాలలో బీటెక్ ప్రథమసంవత్సర విద్యార్థులకు దీక్షారంభం పేరిట నిర్వహించిన కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ.. డెయిరీ పరిశ్రమలో మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. అదిశగా నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. పూర్వవిద్యార్థి శేషకుమార్, డెయిరీసైన్స్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ కె.నాగేశ్వరరావు, ఏడీ ప్రొఫెసర్ డాక్టర్ జి.గంగరాజు,. సీవోఈ ప్రొఫెసర్ డాక్టర్ చెంగల్వరాయులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణతోనే మనుగడ సాధ్యం


విద్యార్థులతో ప్రొఫెసర్ సాయిసుజాత, తదితరులు

తిరుపతి రూరల్, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణతోనే జీవరాశుల మనుగడ సాధ్యమవుతుందని ఎస్వీయూ మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ డి.సాయిసుజాత పేర్కొన్నారు. అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని తుమ్మలగుంటలోని జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం పర్యావరణ పరిరక్షణపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ..పర్యావరణ కలుషితంవల్ల మనుగడకు ముప్పువాటిలే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థులు అవగాహన పెంచుకుని పర్యావరణ రక్షణలో భాగస్వాములు కావాలని తెలిపారు. హెచ్‌ఎం భారతి, రిసోర్స్‌పర్సన్ డాక్టర్ రేఖ, అకడమిక్ కన్సల్టెంట్లు డాక్టర్ రమణ, డాక్టర్ జగదీశ్వరి, డాక్టర్ రాజరాజేశ్వరి, డాక్టర్ సునీత, టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల విజయోత్సవ ర్యాలీ


విద్యార్థుల ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ తిప్పారెడ్డి

తిరుపతి రూరల్, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన అంబేడ్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు జాతీయస్థాయి సంవిధాన్ పే చర్చా-2కే25 మూట్‌కోర్ట్ పోటీల్లో ప్రథమస్థానం సాధించడాన్ని పురస్కరించుకుని మంగళవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ప్రతిభచాటిన చిన్మయి, సాహితి, హర్షితలను పలువురు అధ్యాపకులు, సహచర విద్యార్థులు అభినందించారు. ఈసందర్భంగా విద్యాసంస్థ చైర్మన్ తిప్పారెడ్డి మాట్లాడుతూ.. మూట్‌కోర్ట్ పోటీలలో మొదటిస్థానాన్ని సాధించి.. రన్నరప్ ట్రోఫీ, క్యాష్ అవార్డుని అందుకోవడం సంతోషంగా ఉందని విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ బిజయకుమార్, కమిటీ సెక్రటరీ ఆర్.లక్ష్మీప్రశస్త, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కోటలో కూలిన కోనేరు ప్రహరీ గోడ



చంద్రగిరి, సెప్టెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): చంద్రగిరి కోటలోని పురాతన కోనేరుకు చెందిన ప్రహరీ గోడ సోమవారం రాత్రి భారీ వర్షానికి కూలింది. గతంలో ఈ కోనేరులో ఏపీ టూరిజం ఆధ్వర్యంలో బోటింగ్ నిర్వహిస్తుండేవారు. తర్వాత బోటింగ్ నిలిపివేశారు. ఆర్కియాలజీ అధికారి బాలకృష్ణారెడ్డి మంగళవారం ఉదయం కోనేరు గోడను పరిశీలించారు. అధికారులకు దీనిపై నివేదిక పంపనున్నట్లు కోట అధికారులు తెలిపారు.

మహిళల జీవనోపాధులపై గ్రామసభ


సదస్సులో మాట్లాడుతున్న శోభన్‌బాబు

పాకాల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నేంద్రగుంట, గాదంకి పంచాయతీల్లో మహిళ సమైక్య కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు జీవనోపాదులపై గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం రామ్మోహన్ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. అనంతరం జిల్లా డీఆర్డీఏ పీడీ శోభన్‌బాబు మాట్లాడుతూ వెలుగు ప్రాజెక్ట్ ద్వారా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు వివరించారు.

రామచంద్రాపురం: రామాపురంలో మన డబ్బులు, మన లెక్కలు యాప్‌పై మంగళవారం డ్వాక్రా మహిళలు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం గురుమూర్తి మాట్లాడుతూ ప్రతి పొదుప సంఘం అందులోని సభ్యులు, వారి పొదుపులు, అప్పులు, చెల్లించాల్సిన వాయిదాలను యాప్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. దీని వలన పొదుపు మహిళలు ఎలాంటి మోసాలకు గురయ్యే అవకాశం ఉండదన్నారు. తప్పు లెక్కలు ఉంటే సెల్‌ఫోన్‌లో 1వ నెంబరు బటను నొక్కితే సంబంధిత సిబ్బంది వెళ్లి పూర్తిస్థాయిలో లెక్కలు చెప్పి సంతృప్తి పరుస్తారన్నారు. సీసీలు సుధాకర్, పార్వతి, పొదుపు లీడర్లు పాల్గొన్నారు.

ఈవోకు టీడీపీ నేతల శుభాకాంక్షలు


ఈవోకు శ్రీవారిపటం అందజేస్తున్న నాయకులు

తిరుమల, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌ను తిరుపతి, తిరుమల టీడీపీ నేతలు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తిరుమలలోని ఈవో క్యాంపు కార్యాలయం వద్ద ఆయన్ను ఏపీజీ అండ్ బీసీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, క్లస్టర్ ఇన్‌చార్జ్ శ్రీధర్ వర్మ ఇతర నేతలు కలిశారు. పట్టువస్త్రంతో సత్కరించి శ్రీవారి చిత్రపటం అందజేశారు. నాయకులు బుల్లెట్ రమణ, కోడూరు బాలసుబ్రహ్మణ్యం, సుధాకర్‌రెడ్డి, కృష్ణయాదవ్, మన్యం శ్రీనివాసులు, ఆనంద్‌యాదవ్, రామూర్తిరాయల్, మధు, రాజుయాదవ్, శివషణ్ముగం, వెంకీ, ఆనంద్‌బాబు, దేవరాజు పాల్గొన్నారు.

వాహన మిత్రకు దరఖాస్తుల ఆహ్వానం

భాకరాపేట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): వాహన మిత్ర పథకానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో గిడ్డయ్య సూచించారు చిన్నగొట్టిగల్లు మండలం పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 19వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2న క్షేత్రస్థాయిలో పరిశీలన జరుపుతామన్నారు. అర్హుల తుది జాబితా 24న గ్రామ సచివాలయాల నోటీసు బోర్డులో ప్రదర్శిస్తామన్నారు దసరా కానుక రూ.1500 రూపాయలు వారి ఖాతాలలో ప్రభుత్వం జమ చేస్తుంది అన్నారు. ఆధార్, రేషన్ కార్డులు, వెహికల్ ఆర్‌సీ డ్రైవింగ్ లైసెన్స్ బ్యాంక్ పాస్‌బుక్ ఇన్సూరెన్స్ సర్టిఫికేట్, కుల, ఆదాయ సర్టిఫికెట్లు, వాహన ఫిట్‌నెస్ సర్టిఫికెట్, మొబైల్ నెంబరు ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

రామచంద్రాపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కుప్పంబాదూరు పీహెచ్‌సీలో బుధవారం ఉదయం నారాయణాద్రి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి తేజేశ్వరి ఈమేరకు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలుశిక్ష

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు మరో రూ. 6లక్షల జరిమానా విధిస్తూ రాష్ట్ర ఎర్రచందనం కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. టాస్క్‌ఫోర్సు చీఫ్ సుబ్బరాయుడి కథనం మేరకు ..తమిళనాడు విల్లుపురానికి చెందిన ఎల్.సేత ఇక్కడి జిల్లాలోని చీకిమానుకోన పరిధి లో 2016లో ఎర్రచందనం దుంగలు నరికి తరలించడానికి సిద్ధమయ్యాడు. టాస్క్‌ఫోర్సు పోలీసులు ముందస్తు సమాచారంతో దాడి చేసి నిందితుడ్ని అరెస్టు చేశారు. ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కేసును స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమరనారాయణ సాక్షాధారాలతో రుజువు చేయడంతో నిందితునికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ఆర్టీసీ అప్రెంటీస్ షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ అప్రెంటిస్‌షిప్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీపీటీవో జగదీష్ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, ప్రకాశం పరిధిలో ఉన్న ఐటీఐలో ఉత్తీర్ణులైన వారు మాత్రమే అర్హులు. వచ్చేనెల 4తేదీలోపు ఆర్టీసీ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు 9154291408 నెంబర్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

ఖాళీల వివరాలు..

● చిత్తూరు జిల్లా పరిధిలో డీజిల్ మెకానిక్స్ 33, మోటార్ మెకానిక్స్ 2, ఎలక్ట్రీషియన్స్ 8, వెల్డర్ 1, పెయింటర్ 1, ఫిట్టర్ 3, ● తిరుపతి జిల్లా పరిధిలో డీజిల్ మెకానిక్స్ 62, మోటార్ మెకానిక్స్ 4, ఎలక్ట్రీషియన్స్ 15, వెల్డర్ 2, పెయింటర్ 1, ఫిట్టర్ 5, డ్రాఫ్ట్స్ మెన్ సివిల్ 1, ● నెల్లూరు జిల్లా పరిధిలో డీజిల్ మెకానిక్స్ 62, మోటార్ మెకానిక్స్ 3, ఎలక్ట్రీషియన్స్ 14, వెల్డర్ 2, పెయింటర్ 1, మిషనిస్ట్ 1, ఫిట్టర్ 7, డ్రాఫ్ట్స్ మెన్ సివిల్ 1,● ప్రకాశం జిల్లా పరిధిలో డీజిల్ మెకానిక్స్ 37, మోటార్ మెకానిక్స్ 2, ఎలక్ట్రీషియన్స్ 9, వెల్డర్ 1, పెయింటర్ 1, ఫిట్టర్ 3, డ్రాఫ్ట్స్ మెన్ సివిల్ 1.

కొనసాగుతున్న విద్యుత్ ఉద్యోగుల నిరసన


కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా సర్కిల్ కార్యాలయం వద్ద ఏపీఎస్పీఈ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు చేపట్టిన నిరసన దీక్ష రెండో రోజు మంగళవారం కూడా కొనసాగింది. ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై తమ నిరసన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించేవరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెలకటూరి గోపి, కన్వీనర్ మురళీధర్, నాగరాజు, బాలసుబ్రమణ్యం, మునస్వామి, జయరామ్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నేడు విమానాశ్రయంలో యాత్రి సేవా దివస్

రేణిగుంట, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులను ఆకర్షించే విధంగా విమానాశ్ర యంలో యాత్రి సేవా దివస్ నిర్వహిస్తున్నట్లు తిరుపతి ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ భూమినాథన్ తెలిపారు. మంగళవారం పాత విమానాశ్రయం కార్యాలయ భవనంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు తిరుపతి విమానాశ్రయంలో ఈనెల బుధవారం ఎస్వీ సంగీత కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. మొక్కలు నాటించడం, రక్తదానం, డ్రైవర్లకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.

జోరుగా రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు

అమృత్ భారత్‌తో పాకాల స్టేషన్‌కు మహర్దశ


స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు


రైల్వే స్టేషన్ ముఖద్వార భవన నిర్మాణ పనులు

పాకాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పాకాల రైల్వే స్టేషన్‌లో అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద చేపట్టిన పనులు జోరుగా సాగుతున్నాయి. ముఖ ద్వార భవన నిర్మాణం పూర్తి కావచ్చింది.. బుకింగ్ కౌంటర్, రిజర్వేషన్ కౌంటర్, వెయిటింగ్ హాల్, స్టేషన్ మాస్టర్, స్టేషన్ మేనేజర్ కార్యాలయాలు, రైల్వే గెస్ట్‌హౌస్ ఇతర కార్యాలయాలు ఈ భవనంలో ఉండేలా నిర్మాణాలు సాగుతున్నాయి. ఒకటవ, రెండవ ప్లాట్‌ఫారాలలోని పాత కార్యాలయాల భవనాలను తొలగించారు. వాటి స్థానంలో విశాలంగా నిర్మాణాలు చేపట్టారు. ప్లాట్‌ఫాం పొడిగించారు. మూడు ప్లాట్ ఫారాలలో గ్రానైట్ ఫ్లోరింగ్ వేస్తున్నారు. ప్రత్యేకంగా ఎల్‌ఈడీ లైట్లు, తాగునీటి కుళాయిలు, బెంచీలు ఏర్పాటు చేస్తున్నారు. పాకాల - కాట్పాడి, పాకాల - ధర్మవరం మార్గంలో తిరిగే సుమారు 40కి పైగా రైళ్లు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి.




అనారోగ్యంతో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన డీసీఎంఎస్ చైర్మన్ పల్లినేని సుబ్రహ్మణ్యంనాయుడి భౌతిక కాయం వద్ద మంగళవారం నివాళులు అర్పిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు, తిరుపతి పార్లమెంటరీ నియోజకవర్గం టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్,తదితరులు - విలపిస్తున్న సుబ్రహ్మణ్యం నాయుడి కుటుంబ సభ్యులు

కిడ్నాప్ కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

● స్టెరాయిడ్స్, గంజాయి స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మహిళతో పాటు ఆమె తల్లిని కిడ్నాప్ చేసి దాడి చేసిన కేసులో ఇద్దరు నిందితులను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలిలా....తిరుపతి లక్ష్మీపురం సర్కిల్ వద్ద జిమ్ సెంటర్ నిర్వాహకుడు, రౌడీషీటర్ అజీమ్‌కు ఓ మహిళతో వివాదాలేర్పాడ్డాయి. దీంతో మహిళను, ఆమె తల్లిని మూడు రోజుల క్రితం అజీమ్, డ్రైవర్ బబ్లూ సహాయంతో ఎ వాహనంలో ఎక్కించుకుని కొర్లగుంట వైపు వెళ్లాడు. మాట వినకపోతే చంపేస్తామని బెదిరించారు. ఈలోగా బాధితురాలు తన భర్తకు వాట్సప్‌లో మెసేజి, తామున్న ప్రదేశ వివరాలను పంపింది. ఆమె భర్త ఇచ్చిన సమాచారంతో ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ హేమాద్రి, సిబ్బందితో కలసి వెంటనే కారును వెంబడించారు. పోలీసులను గమనించి మహిళలను రోడ్డుమీద వదిలేసి నిందితులు తప్పించుకోపోయారు. మంగళవారం లక్ష్మీపురం సర్కిల్ వద్ద అజీమ్‌ను,బబ్లూలను అరెస్టు పోలీసులు చేశారు. కారుతో పాటు అజీమ్ జిమ్ సెంటర్‌లో ఉన్న స్టెరాయిడ్స్, విక్రయానికి ఉంచిన 10 కిలోల గంజాయిలను స్వాధీనం చేసుకున్నారు.

పద్మావతిలో థాయ్‌లాండ్ బృందం


యూనివర్సిటీ అధికారులతో థాయ్‌లాండ్ ప్రతినిధులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీని థాయ్‌లాండ్‌లోని ప్రిన్స్ ఆఫ్ సాంగ్‌క్లా యూనివర్సిటీ ప్రతినిధులు సందర్శించారు. పద్మావతి వర్సిటీ వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజనితో వారు మంగళవారం సమావేశమయ్యారు. బోధన, పరిశోధన అంశాల్లో పరస్పర సహకారంపై ఇరు సంస్థల ప్రతినిధులు చర్చించారు. కార్యక్రమంలో వర్సిటీ అంతర్జాతీయ వ్యవహారాల డీన్ విజయలక్ష్మి, అసోసియేట్ డీన్ ఉష, పీఆర్వో శ్రీరజని పాల్గొన్నారు.

విశ్వశాంతి కోసం ధ్యాన మహాయజ్ఞం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సంత్ సదానంద్ గిరి మహారాజ్ స్వామి

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 16(ఆంధ్ర జ్యోతి) : విశ్వశాంతి కోసం ధ్యాన మహాయజ్ఞాన్ని నిర్వహిస్తున్నట్లు పీఎంసీ ట్రస్టు చైర్మన్ దాట్ల హనుమంతరాజు తెలిపారు. మహతి ఆడిటోరియంలోని కళాక్షేత్రంలో పీఎస్ఎంఎం సహకారంతో పీఎంసీ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ వరకు నిర్వహించ తలపెట్టిన ధ్యాన మహాయజ్ఞం మంగళవారం జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ధ్యాన మహాయజ్ఞ కమిటీ చైర్మన్ బ్రహ్మర్షి జక్కా రాఘవరావు, వైస్ చైర్మన్ సంగీతబాబు మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం ఇటువంటి ధ్యాన యజ్ఞాలు నిర్వహించడం అవసరమని పేర్కొన్నారు. అనంతరం నటరాజ బృందంచే సామూహిక అఖండ సంగీత నాద ధ్యానం నిర్వహించారు. ఈ నాద ధ్యానంలో విశేష సంఖ్యలో ధ్యానులు పాల్గొని మూడు గంటలపాటు సామూహిక ధ్యానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ చెంగల్‌రాయుడు, సంత్ సదానంద్ గిరి మహారాజు, ది పరిమిడ్ స్పిరుచ్యువల్ ట్రస్టు హైదరబాద్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, సీబీఐ మాజీ డైరెక్టర్ కార్తికేయన్, పీఎంసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్ కుమార్, సిద్దనాగేశ్వరరావు, తిరుపతి అధ్యక్షులు బ్రహ్మర్షి కంచి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన పెంచుకోండి



ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

రామచంద్రాపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకోవాలని సామాజిక విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కుసుమ కోరారు. సూరావారి పల్లె, సీకేపల్లి, రేణుకాపురం, వేణుగోపాలపురం, తిమ్మరాజుపల్లి గ్రామాల్లో ఎస్వీ యూనివర్శిటీ సామాజిక విభాగం విద్యార్థులు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు వెంకటేశ్వర్లు, బొల్లినేని ముకుందనాయుడు, రమణయ్య పాల్గొన్నారు.

టీసీ కోసం అర్ధనగ్న నిరసన



తిరుపతి (విశ్వ విద్యాలయాలు), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఆర్ట్స్ కాలేజీలో ఎంఏ పొలిటికల్ సైన్స్ పూర్తి చేసిన విద్యార్థి వినోద్‌కుమార్ టీసీ కోసం అర్ధనగ్న నిరసన చేపట్టాడు. బీఈడీ చేయాలనే ఆలోచనతో టీసీ కోసం కళాశాలకు మంగళవారం వచ్చాడు. ఫీజు బకాయిలు విడుదల కాకపోవడంతో టీసీ ఇచ్చేందుకు కళాశాల అధి కారులు నిరాకరించడంతో అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. విద్యార్థుల ఫీజు బకా యిలతో సంబంధం లేకుండా విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ నేత అశోక్ కుమార్ కోరారు. ప్రభుత్వం పెండింగ్ బకాయిలను విడుదల చేయకపోతే ఆందోళన చేపడతామని ఆయన స్పష్టంచేశారు.

ఆటో బోల్తా: ఆరుగురికి గాయాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడటంతో అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు గాయపడ్డారు. ఈఘటన మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలోని భరద్వాజ తీర్థంలో జరిగింది. నెల్లూరు నగరానికి చెందిన ఆరుగురు శ్రీకాళహస్తి పట్టణం చెంచులక్ష్మికాలనీలోని బంధువుల ఇంటికి వచ్చారు. ఆటోలో భరద్వాజ తీర్థం నుంచి భక్తకన్నప్ప కొండ మార్గంలోని ఫొటోలు దిగే స్థావరం వద్దకు వెళ్తుండగా బ్రేక్ ఫెయిల్ కావడంతో ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో రెహాన, కరీష్మాకు తీవ్ర గాయాలయ్యాయి.

గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు సాదర వీడ్కోలు



రేణిగుంట సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు సాదర వీడ్కోలు పలికారు. జిల్లాలో మూడు రోజుల పర్యటన ముగించుకుని మంగళవారం మధ్యాహ్నం తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు జేసీ శుభం బన్సల్ సాదరంగా వీడ్కోలు పలికారు. అదనపు ఎస్పీ రవి మనోహరాచారి, డీఎస్పీ శ్రీనివాసరావు, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు


తిరుమలలోని అన్నమయ్య భవనంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన సమావేశమైన ధర్మకర్తల మండలి

తిరుమల, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్టు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఈఏడాది బ్రహ్మోత్సవాలను గతం కంటే మరింత మెరుగ్గా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రెండున్నర గంటల పాటు చర్చించారు. అందరికీ సంతృప్తికర వాహనసేవల దర్శనం లభించేలా చూడాలనే అంశంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చైర్మన్ తెలిపారు. పెరటాశి మాసం ప్రారంభమైన నేపథ్యంలో రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక దర్శనాలు రద్దు చేసి సామాన్యులకు ప్రాధాన్యత కల్పించాలని నిర్ణయించారు. 28న జరిగే గరుడసేవ సందర్భంగా 27వ తేదీ రాత్రి 9 నుంచి 29వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ద్విచక్రవాహనాల అనుమతిని రద్దు చేశారు.

ఏప్రిల్లో సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ ఖోఖో మీట్






విజేతలుగా నిలిచిన బాలికల- బాలుర జట్టు-పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్వీయూ వీసీ అప్పారావు

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): 2026 ఏప్రిల్ 2నుంచి 6తేదీ వరకు సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ ఖో ఖో మీట్ తిరుపతిలోని ఎస్వీయూ మైదానంలో నిర్వహించనున్నట్లు ఆటోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరి, ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.శివశంకర్ రెడ్డి వెల్లడించారు. మంగళవారం ఎస్వీయూ వీసీ చాంబర్‌లో వేంకటేశ్వర స్పోర్ట్స్ బోర్డు సమావేశం నిర్వహించారు. వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అనంతరం వీసీ అప్పారావు మాట్లాడుతూ ఈ మీట్‌కు దేశవ్యాప్తంగా ఉన్న దాదాపు 80యూనివర్శిటీల ఖో ఖో మెన్ జట్లు పాల్గొంటున్నాయన్నారు. మెరుగైన ఏర్పాట్లపై కసరత్తు ప్రారంభించాలన్నారు. ప్రాంతాలవారీగా ఎంత మంది వస్తున్నారో తెలుసుకుని వసతి, ఆతిథ్యం, రవాణా, మైదానంలో కల్పించే సదుపాయాలలో లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. వారితోపాటు వచ్చే ప్రొఫెసర్లు, వ్యాయామ విభాగాధిపతులను దృష్టిలో ఉంచుకొని సన్నాహాలు చేయాలన్నారు. అలాగే ఎస్వీయూ ఇంటర్ కాలేజీ మెన్ కబడ్డీ టోర్నీ కూడా ఈనెల 23న జరగనుంది.

అందుకు సంధించిన ఏర్పాట్లను వేగవంతం చేయాలన్నారు. దశలవారీగా ఇంటర్ కాలేజీ స్పోర్ట్స్ మీట్ జరగనున్నాయని, త్వరలో దానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్స్ భాస్కర్‌రెడ్డి, ఎస్వీయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతమ్మ, నగేష్, తాండవ కృష్ణ, నరసింహారావు, శ్రీనివాసులు, దేవీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



తిరుపతి అర్బన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు మంగళవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అందజేశారు. ఎంఆర్‌పల్లికి చెందిన మునిరాజకు రూ.5.16లక్షలు, రాజీవ్‌నగర్‌కు చెందిన సుధాకర్‌కు రూ.2.02లక్షలు, భవానీనగర్‌కు చెందిన భాగ్యమ్మకు రూ.33వేలు, రాజీవ్‌గాంధీకాలనీకి చెందిన రమేష్‌కు 42.5వేలు శివజ్యోతినగర్‌కు చెందిన జ్యోతీశ్వర్‌రెడ్డి 43.8వేల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, కొండా రాజమోహన్, మునిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి బొజ్జా తారకం



తారకం చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న నాయకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పేదల పక్షపాతి బొజ్జా తారకం అని పలువురు వక్తలు కొనియాడారు. దళిత, హక్కుల ఉద్యమ నేత బొజ్జా తారకం 9వ వర్ధంతి సభ తిరుపతిలో మంగళవారం నిర్వహించారు. రిటైర్డు జడ్జిలు గుర్రప్ప, ఆనంద్, సీఐటీయూ నేత కందారపు మురళి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విజయకుమార్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, ఆర్పీఐ అధ్యక్షుడు అంజయ్య, లాయర్ సంపూర్ణమ్మ తదితరులు పాల్గొని మాట్లాడారు. జీవితాంతం పేదల హక్కుల కోసం బొజ్జా తారకం పోరాటం చేశారని కొనియాడారు. పౌర హక్కుల సంఘం ఉమ్మడి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, విరసం సభ్యులుగా, దళిత మహాసభ స్థాపకులుగా పనిచేసి ఎమెర్జెన్సీ కాలంలో రెండేళ్ల జైలు జీవితాన్ని గడిపారని తెలిపారు. అనేక చారిత్రక ఉద్యమాల్లో కీలకంగా పనిచేసిన ఆయన్ను దళిత ఉద్యమకారులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుష్పరాజ్, ప్రసాదరావు, సుబ్రమణ్యం, నాగేంద్ర, హరిబాబు, రాజేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సంతకాల సేకరణను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న చిట్టిబాబు

తిరుపతి (వైద్యం), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఓట్ల చోరీకి తెగబడుతున్న బీజేపీ వైఖరిని వ్యతి రేకిస్తూ కాంగ్రెస్ ఈ నెల 20న నిర్వహించే ప్రజాసంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు పిలుపునిచ్చారు. తిరుపతిలోని ఓ ప్రవేటు హోటల్లో ఆయన మంగళవారం పార్టీ నేతలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగ ఓట్లకు స్వస్తి పలికి ఓటర్ల జాబితను పక్కాగా తయారు చేసేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అటు పార్లమెంటులోనూ ఇటు ప్రజా ఉద్యమాలకు శ్రీకారం చుట్టారన్నారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా ఈ నెల 20న నిర్వహిస్తున్న ప్రజాసంతకాల సేకరణ కార్యక్రమాన్ని తిరుపతిలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నామన్నారు. ప్రజా సంఘాలు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. అనంతరం ఆయన కాంగ్రెస్ పార్టీ నగర కమిటీతో ఓటర్ల జాబితాలో అక్రమాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు బాలగురవం బాబు, నాయకులు మురళీకృష్ణ, శివశంకర్, రాంభూపాల్‌రెడ్డి, సుప్రజ, వెంకటాచలపతి పాల్గొన్నారు.

వైద్యంతో పాటు రోగుల భద్రత కూడా ప్రధానం



రోగుల భద్రత గురించి మాట్లాడుతున్న కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి నాగరాజ్

తిరుపతి (వైద్యం), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్యసేవలు అందించడమే కాకుండా ఆస్పత్రిలో వారికి భద్రత కల్పించడం కూడా ప్రధానమని కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి నాగరాజ్ అన్నారు. ప్రపంచ రోగుల భద్రతా దినోత్సవం సందర్భంగా స్విమ్స్‌లో మంగళవారం రోగుల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి నవజాత శిశువుకు సురక్షితమైన సంరక్షణ అనే నినాదంతో ముందుకు సాగుతోందన్నారు. ఆస్పత్రిలో అనుకోని ప్రమాదాలు, రోగుల మధ్య వివాదాలు, నవజాత శిశువుల అపహరణలు వంటివి చోటుచేసుకున్నప్పుడు ఏ విధంగా జాగ్రత్తలు పాటించాలనే విషయాలను ఆయన వివరించారు. అనంతరం రోగుల భద్రతకు స్విమ్స్‌లో చేపడుతున్న చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ రామ్, ఆర్ఎంవో కోటిరెడ్డి, వైద్య విభాగాధిపతులు సృజన, అంజు, ఐశ్వర్య పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల అన్నదానం



తిరుపతి(విద్య), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ జన్మదినం సందర్భంగా స్థానిక బీజేపీ నాయకులు అన్నదానం నిర్వ హించారు. ముందుగా స్థానిక వినాయకసాగర్ సంకల్పసిద్ధి వినాయక స్వామి ఆలయంలో మంత్రి పేరుపై ప్రత్యేక పూజలు అనంతరం స్థానిక గోవిందరాజస్వామివారి ఉత్తర మాడ వీధిలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు గాలి పుష్పలత, గుండాల గోపీనాథ్‌రెడ్డి, చంద్రబాబుయాదవ్, సుబ్రహ్మణ్యంయాదవ్, రాజశేఖర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, రామిరెడ్డి, మండ్యం రమేష్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్‌కేయాదవ్ కోరారు. మంగళవారం డీఆర్వో నరసింహులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్, స్థానిక సంస్థలు, నామినేటెడ్ పోస్టులలో 34శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. వాటిని అమలు చేయాలన్నారు. జనాభా దామాషా మేరకు స్థానిక సంస్థల రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లోకనాథంగౌడ్, వాసుకుమార్, తిరుమలేష్, పద్మప్రియ, భాస్కర్, గోపాల్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వేద వర్సిటీలో ఉచిత కంటి, దంత వైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వేద విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉచిత కంటి, దంత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 250 మంది విద్యార్థులు, ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. రిజిస్ట్రార్ భాస్కరుడు, డీన్ సుబ్రమణ్యశర్మ, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

రసవత్తరంగా క్రీడా పోటీలు

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నగరశివారు మంగళం ట్రెండ్స్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎస్జీఎఫ్ క్రీడా ఎంపిక పోటీలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా అండర్-14, -17 బాలబాలికల కబడ్డీ, ఖోఖో, యోగా పోటీలు నిర్వహించారు. గ్రామీణ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 300మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖోలో 48మంది చొప్పున బాలబాలికలు, యోగాకు 20మంది బాలబాలికలు ఎంపికయ్యారు.త్వరలో జరగనున్న డివిజన్‌స్థాయి పోటీలలో పాల్గొననున్నారు. బుధవారం శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బ్యాడ్మింటన్, గురువారం దుర్గసముద్రంలో వాలీబాల్, అథ్లెటిక్స్, చదరంగం పోటీలు నిర్వహించనున్నామని మండల కో-ఆర్డినేటర్ సాంబశివరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు సురేష, రూపలత తెలిపారు.

5న భక్త కనకదాసు విగ్రహ ప్రతిష్ఠ



భక్తకనకదాసు విగ్రహ ప్రతిష్ఠ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కురబ సంఘం నాయకులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో అక్టోబరు 5వ తేదీన జరగనున్న భక్త కనకదాసు విగ్రహ ప్రతిష్ఠకు సంబంధించిన వాల్‌పోస్టర్లను కురవ, కురబ సంఘం నాయకులు ఆవిష్కరించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలోకురబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, సంఘం నాయకులు రిటైర్డ్ డీఎస్పీ పోతప్ప, వెలగపల్లి భాస్కర్, కెఎస్.నంజుండప్ప, వెంకటప్ప, ఆనంద్, వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్ల దినోత్సవం



ఇంజనీర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ సిబ్బంది

తిరుపతి(విద్య), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా స్థానిక ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో మంగళవారం ఇంజనీర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాలలోని మోక్షగుండం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీపీటీఈ అధ్యక్షులు ప్రసాదరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ద్వారకనాథరెడ్డి, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి సుజాత పాల్గొన్నారు.

ఎస్వీయూ టీఎన్ఎస్ఎఫ్ నూతన కమిటీ ఎన్నిక



వెంకటేష్‌నాయుడు, కుసుమ స్వరాజ్, గంగాధర్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ టీఎన్ఎస్ఎఫ్ నూతన కమిటీ ఎన్నికైంది. అధ్యక్షులుగా బి.వెంకటేష్ నాయుడు, మహిళా అధ్యక్షురాలుగా కుసుమ స్వరాజ్, ప్రధాన కార్యదర్శిగా డి.గంగాధర్‌ను ఎన్నుకున్నారు. ప్రభుత్వ పథకాలను విద్యార్థుల్లోకి తీసుకెళ్లడం, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కమిటీ స్పష్టం చేసింది. వీరిని టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు హేమంత్‌రాయల్ అభినందించారు.





రాయలచెరువు రోడ్డు, డీఆర్‌మహల్ రోడ్డులో రైల్వే అండర్ బ్రిడ్జిల కింద చేరిన నీరు

నగరంలో దంచికొట్టిన వాన



మధ్యాహ్నం వరకు కూడా డీఆర్‌మహల్ అండర్ బ్రిడ్జి వద్ద తొలగించని నీరు



రాయలచెరువు రోడ్డులోని అండర్‌బ్రిడ్జి కింద నీరు నిండిపోవడంతో ప్రమాదకరంగా గోడను దాటుతున్న మహిళలు



డీఆర్‌మహల్ అండర్ బ్రిడ్జి కింద పేరుకుపోయిన చెత్త

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం వేకువజాము వరకు వాన దంచికొట్టింది. బంగాళఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో పగలంతా ఎండతీవ్రత కొనసాగింది. రాత్రి 10గంటల తర్వాత ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. జోరు వర్షం నగరాన్ని ముంచెత్తింది. ప్రధానంగా రైల్వే అండర్ బ్రిడ్జిల వద్ద మోటార్లు మొరాయించాయి. దీంతో అండర్‌బ్రిడ్జిలు పూర్తిగా వర్షపునీటితో నిండిపోయాయి. ట్రాఫిక్ స్తంభించింది. వాహనాలు దారి మళ్లాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలు రోడ్లపైకి కొట్టుకొచ్చాయి. రోడ్లు చెరువలను తలపించాయి. ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్, సెంట్రల్ బస్సుస్టేషన్‌లలో బురద పేరుకుపోయింది. వర్షపునీరు మురుగు కాలువల ద్వారా నగరానికి తూర్పుగా ఉన్న చెరువులకు చేరింది. కాగా కొన్ని రోజులుగా పెరిగిన ఎండతీవ్రత నుంచి ఈ వర్షం కాస్త ఉపశమనం కల్పించింది.

బోధనేతర పనులు రద్దు చేయాలి

● బైక్ జాతా నిర్వహించిన ఉపాధ్యాయులు



బైక్‌జాతా నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలను రద్దు చేయాలని యూటీఎఫ్ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం వారు తిరుపతిలో 'రణభేరి ప్రచార బైక్ జాతా' నిర్వహించారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై బైక్‌జాతాను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు యాప్‌లలో సమాచారాన్ని అప్‌లోడ్ చేయడంతో పాటు ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు అడుగుతున్న సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఇవ్వడానికే సమయం సరిపోతోందన్నారు. అలాంటప్పుడు విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా లభిస్తుందని ప్రశ్నించారు. ఫౌండేషన్ స్కూల్స్ పేరుతో ఎక్కువ పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయన్నారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల ప్రధాన కార్య దర్శులు ముత్యాలరెడ్డి, మణిగండన్ మాట్లాడుతూ పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటుచేయాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవరాల నిర్మల, జిల్లా గౌరవాధ్యక్షులు దండు రామచంద్రయ్య, యూటీఎఫ్ నాయకులు మధు, మధుసూదన్ రెడ్డి, పద్మజ, మోహన్, చీళ్ల సురేష్, హేమాద్రి బాబు, ఎస్‌కే బాష, కవిత, ప్రభు కుమార్, మురళి పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య భద్రతే లక్ష్యం



స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పోస్టర్లు విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా చేపట్టినబ 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ పలుపునిచ్చారు. స్థానిక జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యా లయంలో ఆయన ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను మంగళవారం వైద్యాధి కారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ (ఆరోగ్య వంతమైన మహిళ-శక్తివంతమైన కుటుంబం) కార్యక్రమాన్ని ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు రెండు వారాలు పక్కాగా నిర్వహించాలన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో రెండు వారాల పాటు మహిళల కోసం ప్రత్యేకంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పోషకాహారం, రక్తహీనత వలన కలిగే నష్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కిశోర బాలికల ఆరోగ్య పరిస్థితుల వంటి విషయాలపై అవగాహన కల్పించాలని తెలియజేశారు. ఆయుష్మాన్ ఆరోగ్య కార్డులు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి శ్రీనివాసరావ్ తదితరులు పాల్గొన్నారు.

మాట ఇచ్చారు..జాబు ఇచ్చారు

అసత్యం వైసీపీ అభిమతం - కరుణాకరరెడ్డిపై చర్యలు తీసుకోవాలి - శాప్ చైర్మన్ రవి నాయుడు



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న రవినాయుడు తదితర నాయకులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : ఇచ్చిన మాట ప్రకారం డీఎస్సీ నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కూటమి ప్రభుత్వం కల్పించిందని శాప్ చైర్మన్ రవినాయుడు తెలిపారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీన ఉద్యోగ నియామక పత్రాలను ముఖ్యమంత్రి అందజేయనున్నారని తెలిపారు. ఈ డీఎస్సీని అడ్డుకోవాలని వైసీపీ సకల ప్రయత్నాలు చేసిందన్నారు. హైకోర్టులో 104 కేసులను వేసినా వాటిని కొట్టివేశారని చెప్పారు. ఈ విషయంలో మంత్రి లోకేష్ సమర్థతతో పని చేశారని వివరించారు. స్పోర్ట్స్ కోటాలోనూ డీఎస్సీలో అవకాశం కల్పిస్తూ సీఎం నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. మెడికల్ కాలేజీల విషయంలో వైసీపీ అసత్య ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నాలు చేస్తోందన్నారు. వాస్తవానికి రుషికొండపై విలాసవంతమైన ప్యాలెస్‌ను నిర్మించుకున్న జగన్ ఈ కాలేజీలపై మాత్రం శ్రద్ధ చూపలేదన్నారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను అందుబాటులోకి తీసుకురావాలనే సంకల్పంతో ముందడుగు వేస్తుంటే అసత్యాలను ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ఒక శిల్పి పూర్తిచేయకుండా వదిలేసిన శనేశ్వర స్వామి విగ్రహం కొన్నేళ్లుగా అలిపిరి పాత చెక్‌పోస్టు వద్ద ఉందన్నారు. ఈ విషయం అందరికీ తెలుసన్నారు. అయితే మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తాజాగా అక్కడ విష్ణుమూర్తి విగ్రహాన్ని పడేసినట్లు నమ్మబలుకుతూ బ్రహ్మోత్సవాల ముందు టీటీడీపై విషం కక్కుతున్నారన్నారు. అసత్యాలతో టీటీడీ ప్రతిష్ఠతకు భంగం కలిగిస్తున్న కరుణాకరరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అంతకు ముందు తెలుగుయువత, టీడీపీ నాయకులతో కలిసి డీఎస్సీ ఉద్యోగ నియామకాలు చేపట్టినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్లకార్డులను ప్రదర్శించారు. తెలుగుయువత, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంఎస్ సుబ్బులక్ష్మి జయంతి



తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో ప్రముఖ గాయని ఎంఎస్ సుబ్బులక్ష్మి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వ హించారు. స్థానిక పూర్ణకుంభం సర్కిల్ వద్దనున్న సుబ్బులక్ష్మి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, రంగస్థలి వ్యవస్థాపక కార్యదర్శి కెఎన్.రాజా, కళాకారులు సుబ్రహ్మణ్యంరెడ్డి, మురళీకృష్ణ, రాజశేఖర్‌రెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, జేజీరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పద్మావతి డిగ్రీ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం నిర్వ హించారు. కాలేజీలో చేపట్టిన ర్యాలీలో ప్రిన్సిపాల్ నారాయణమ్మ, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి



ఏవో రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నేతలు

కలెక్టరేట్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద మంగళవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి మెమో 57ను తక్షణం అమలు చేయాలన్నారు. 12వ సీఆర్సీ కమిషన్‌ను నియమించి ఐఆర్‌ను ప్రకటించాలని తెలిపారు. అన్ని రకాల బకాయిలను చెల్లించాలన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటాద్రి, చెంచురాజు, హేమ కుమార్, గోపాల్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఈవోకు ధర్మకర్తల మండలి అభినందన



టీటీడీ ఈవోగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన అనిల్‌కుమార్ సింఘాల్‌కు టీటీడీ ధర్మకర్తల మండలి ఛైర్మన్ బీఆర్ నాయుడు, సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. తిరుమలలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో పాల్గొన్న ఈవో సింఘాల్‌ను బోర్డు స్వాగతించింది. అన్ని విధాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చింది. గతంతో ఈవోగా పనిచేసిన అనిల్‌కుమార్ సింఘాల్‌కున్న అనుభవం భక్తులకు మెరుగైన సేవలు అందించడంలో, టీటీడీని అభివృద్ధి దిశగా నడిపించడంతో ఉపయోగపడుతుందని బోర్డు సభ్యులు అభిప్రాయపడ్డారు. మరోసారి ఈవోగా అవకాశం ఇచ్చిన సీఎంకు సింఘాల్ కృతజ్ఞతలు తెలిపారు. బోర్డు సలహాలు, సహకారంతో భక్తులకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తానన్నారు. అంతకు ముందు ఛైర్మన్, బోర్డు సభ్యుడు శాంతారాం ఈవోను సత్కరించారు.


- తిరుమల, ఆంధ్రజ్యోతి

రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షుడిగా విజయభాస్కరరావు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షుడిగా ఎస్వీయూ ఫిజిక్స్ విభాగ ప్రొఫెసర్ ఎస్.విజయభాస్కరరావు నియమితులయ్యారు. ఎస్వీయూలోనే పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేసి, 1992 లో ఫిజిక్స్ అధ్యాపకుడిగా చేరారు. ఫిజిక్స్ విభాగాధిపతిగా, ఎస్వీయూ రీసెర్చ్ డీన్‌గా, విక్రమసింహపురి యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా వ్యవహరించారు. ఈయన పర్యవేక్షణలో 30 పీహెచ్‌డీలు, 10 రీసెర్చ్ ప్రాజెక్టులు పూర్తయ్యాయి. సుమారు 200 పరిశోధనా వ్యాసాలు రూపొందించారు. 104వ ఇస్కా కార్యదర్శిగా సేవలందించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడిగా బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తుతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.13 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,066

తలనీలాలు సమర్పించినవారు: 24,620

సారీ.. శనేశ్వరా..!

- శని భగవానుడినీ వదలని రాజకీయ గ్రహణం
- అది విష్ణుమూర్తి అంటూ కరుణ దుష్ప్రచారం
- అభయ శనేశ్వరుడని చెప్పినా వినిపించుకోని వైనం



విగ్రహం వద్ద కరుణాకరరెడ్డి

తిరుపతి/తిరుమల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం శ్రీ వేంకటేశ్వర శిల్పకళాశాల సమీపంలో రెండు దశాబ్దాల కిందటి నుంచి పడున్న ఓ అసంపూర్తి శనేశ్వర విగ్రహానికి వైసీపీ రాజకీయరంగు పులిమింది. టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి హఠాత్తుగా మంగళవారం ఆ విగ్రహం వద్దకు చేరుకున్నారు. పాదపీటికకు మొక్కి కళ్లకద్దుకున్నారు. కొబ్బరికాయ కొట్టి కోనేటిరాయుడా.. ఏమిటీ నీకీ దుస్థితి? హైందవ ధర్మానికి తూట్లు పొడుస్తున్నారని అంటూ ఆవేదనచెందారు. విగ్రహం పడేసిన చోట మూత్ర విసర్జన చేస్తున్నారని, మద్యం తాగుతున్నారని ఆరోపించారు. విష్ణుమూర్తికి జరిగిన అపచారానికి హిందూ సంఘాలన్నీ ఏకంకావాలంటూ పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచీ ఘోరాలు జరిగిపోతున్నాయని ధ్వజమెత్తారు. దీనిపై సోషల్ మీడియాలో ఫొటోలు పోస్ట్ చేశారు. ఈ విషయం తెలిసి టీడీపీ నాయకులు వాస్తవాలను ప్రజలకు చెప్పాలని ఘటనా స్థలికి వెళ్లారు. అది విష్ణుమూర్తి కాదని, అభయ శనేశ్వర విగ్రహమని రుజువు చేశారు. రెండు దశాబ్దాలుగా అక్కడుందని అన్నారు. అయినా, కరుణాకర్‌రెడ్డి మాత్రం సవరించుకోలేదు. వైఖానస ఆగమశాస్త్రం తెలియని వాళ్లు తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని, అది ముమ్మాటికీ విష్ణుమూర్తి రూపమేనని పునరుద్ఘాటించారు. మరోవైపు, మధ్యాహ్నం తిరుమలలో టీటీడీ పాలకమండలి సమావేశంలో ఈ అంశం ప్రస్తావనకు రావడంతో సభ్యులు తీవ్రంగా స్పందించారు. టీటీడీపై తప్పుడు ప్రచారాలు చేసే వారిపై క్రిమినల్ కేసులు పెడతామని, జైలుకు పంపిస్తామని ఛైర్మన్ బీఆర్ నాయుడు, సభ్యులు హెచ్చరించారు.

శనేశ్వరుడినీ వదలవా?: టీడీపీ

రెండు సార్లు ఎమ్మెల్యేగా, టీటీడీ ఛైర్మన్‌గా పనిచేసిన వ్యక్తికి ఎప్పటినుంచో పడున్న అసంపూర్తి శనేశ్వర విగ్రహం గురించి తెలియదా అని టీడీపీ నేతలు ప్రశ్నించారు. యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, శాప్ ఛైర్మన్ రవినాయుడు, గంగమ్మ ఆలయ ఛైర్మన్ మహేష్ యాదవ్, సీనియర్ నాయకులు ఊకా విజయకుమర్, జేబీ శ్రీనివాస్ తదితరులు ఈ విగ్రహాన్ని పరిశీలించి మీడియాతో మాట్లాడారు. నాస్తికుడైన కరుణాకర్‌రెడ్డి పదే పదే టీటీడీపై దుష్ప్రచారం చేయడం తగదన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేందుకు తప్పుడు ప్రచారాలు చేస్తే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కుటుంబసమేతంగా కొండకు వెళ్లి తలనీలాలు ఇచ్చి, స్వామిని వేడుకుంటే తప్ప మీపాపం పోదని మండిపడ్డారు.



విగ్రహాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

ఆర్డర్ ఇచ్చిన వ్యక్తి చనిపోవడంతో ఆ విగ్రహాన్ని వదిలేశాం



మీడియాతో మాట్లాడుతున్న గురుస్వామి

ఈ ఆరోపణల నేపథ్యంలో విగ్రహాన్ని తయారు చేసిన కన్నయ్యచారి కుమారుడు గురుస్వామి తిరుమల చేరుకున్నారు. టీటీడీ బోర్డుకు వివరాలు వెల్లడించారు. మీడియాతోనూ మాట్లాడారు. 'దాదాపు 22 ఏళ్ల కిందట మాకు రాయలచెరువు రోడ్డులో విగ్రహాల తయారీ షెడ్డు ఉండేది. ఆ సమయంలో బెంగళూరుకు చెందిన వ్యక్తి శనీశ్వరుడు విగ్రహం కావాలని రూ.2 లక్షలు, డ్రాయింగ్ ఇచ్చారు. పది చేతులు, కాకికి బదులుగా సింహం పెట్టాలని కోరాడు. తర్వాత ఆ వ్యక్తి చనిపోయాడు. మా పరిస్థితి కూడా బాగాలేకపోవడంతో అక్కడి స్థలాన్ని విక్రయించి అన్ని విగ్రహాలతో అలిపిరిలోని శిల్ప క్వార్టర్స్‌కు వెళ్లాం. 2003లో అలిపిరిలో చంద్రబాబుపై జరిగిన క్లైమోర్‌మైన్ పేలుడుతో మమ్మల్ని అక్కడ్నుంచి ఖాళీ చేయించారు. ఆ సమయంలో చిన్నచిన్న విగ్రహాలు తీసుకున్నామే తప్ప, ఈ భారీ శనీశ్వరుడి విగ్రహాన్ని అక్కడే వదిలేశాం. 22 ఏళ్లుగా ఈ విగ్రహం అక్కడే ఉంది. చాలాసార్లు తరలించే ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదు' అని స్పష్టతనిచ్చారు.

శనీశ్వరుడికి, మహావిష్ణువుకు తేడా తేలీదా?

- టీటీడీ సభ్యుల ఆగ్రహం

శనీశ్వరుడికి, మహావిష్ణువు తేడా తెలియదా అంటూ భూమనను టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ప్రశ్నించారు. 'ఓ రాజకీయ నిరుద్యోగి. పాత చెప్పు ఇవ్వండి ఆ నల్లరాయిని కొడతా అన్న వ్యక్తి. టీటీడీ ఛైర్మన్‌గా, బోర్డు సభ్యుడిగా పనిచేసిన కరుణాకరరెడ్డి అబద్ధాలకు కేరాఫ్ అడ్రెస్‌గా మారారు' అని ఆగ్రహించారు. తిరుమలలోని ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో రెండుసార్లు భూమన టీటీడీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడూ ఈ విగ్రహం అక్కడే ఉందన్నారు. అప్పుడు పూజలు చేయకుండా ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. ఆయనే ఈ విగ్రహం సమీపంలో మద్యం బాటిళ్లు, పొగాకు ఉత్పత్తుల ప్యాకెట్లు వేయించినట్టు అనుమానాలున్నాయన్నారు. హిందూ వ్యతిరేక ప్రభుత్వంగా చిత్రీకరించేందుకు కరుణాకరరెడ్డి ముందస్తు ప్రణాళికతోనే ఈ ఆరోపణలు చేశారన్నారు. 'నువ్వు ఇంట్లో ఆచరించే మతవిశ్వాసాలు వేరు. ఉనికి కోసం బయట ఆచరించే మతం వేరు. కేవలం ధనార్జన కోసం టీటీడీని, శ్రీవారిని ఉపయోగించుకున్న భక్తిలేని వ్యక్తివి' అంటూ మరో సభ్యుడు ఎంఎస్ రాజు మండిపడ్డారు. కరుణాకరరెడ్డి రోజురోజుకు దిగజారిపోయి మాట్లాడుతున్నారంటూ డాలర్స్ దివాకర్‌రెడ్డి విమర్శించారు. విష్ణుమూర్తికి మీసాలు ఉండవనే విషయాన్ని భూమన గ్రహించాలని పనబాక లక్ష్మి సూచించారు.

భూమనపై కేసు నమోదు

కాగా,టీటీడీపై దుష్ప్రచారం చేస్తూ హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్నారంటూ టీటీడీ డీఈఈ గోవిందరాజులు వైసీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డిపై అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రజలను తప్పుదారి పట్టించడం ద్వారా సమాజంలో అల్లకల్లోలం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు భూమనపై పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. కాగా, టీటీడీ ఫిర్యాదు నేపథ్యంలో భూమన మరో వీడియోను విడుదల చేశారు. శనీశ్వరుడి విగ్రహానికి శంకుచక్రాలు ఎందుకుంటాయని ప్రశ్నించారు. ఒకవేళ శనీశ్వరుడి విగ్రహం అనుకున్నా దేవుడే కదా? ఎవరో తెచ్చి పడేస్తే తీసివేయాల్సిన బాధ్యత టీటీడీకి లేదా? అని ప్రశ్నించారు. తనకు జైలు కొత్తకాదని స్పష్టం చేశారు.

రైల్వే బ్రిడ్జి గడ్డర్ల మార్పు పనుల్లో

తీవ్ర జాప్యం

- గంటల తరబడి ఆలస్యంగా నడిచిన రైళ్లు
- అర్ధాంతరంగా పలు లోకల్ రైళ్ల రద్దు



గడ్డర్ల మార్పు పనులు చేస్తున్న రైల్వే సిబ్బంది

తడ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రైల్వే బ్రిడ్జి గడ్డర్ల మార్పు పనుల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకోవడంతో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు గంటల కొద్దీ ఆలస్యంగా నడవగా, మరికొన్ని రైళ్లను అర్ధాంతరంగా రద్దు చేశారు. చెన్నై - గూడూరు మార్గంలోని తడ - సూళ్లూరుపేట స్టేషన్ల మధ్య కాళంగి నదిపై ఉన్న బ్రిడ్జికి ఇనుప గడ్డర్ల స్థానంలో సిమెంట్ గడ్డర్ల ఏర్పాటు చేయాలని సదరన్ రైల్వే అధికారులు నిర్ణయించారు. సోమవారం అర్ధరాత్రి 1.10నుంచి మంగళవారం ఉదయం 9.10 వరకు పనులు చేసేందుకు సన్నద్ధమయ్యారు. ఈ మేరకు పలు రైళ్లను పూర్తిగా, మరికొన్ని రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు.సోమవారం అర్ధరాత్రి మొదలైన పనులను ఉదయం 9.10కి పూర్తి చేయాల్సి ఉండగా, మధ్యాహ్నం 2గంటల వరకు కొనసాగించారు. దీంతో చెన్నై - విజయవాడ మధ్య నడిచే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు గంటల కొద్దీ ఆలస్యంగా నడిచాయి. అలాగే చెన్నై - సూళ్లూరుపేట మధ్య నడిచే లోకల్ రైళ్లు చెన్నై - ఎలావూరు మధ్య నడిచాయి. చెన్నై సెంట్రల్ నుంచి లక్నో వెళ్లే లక్నో ఎక్స్‌ప్రెస్, విజయవాడ నుంచి చెన్నైకు వెళ్లే పినాకిని ఎక్స్‌ప్రెస్, చెన్నై నుంచి అహ్మదాబాద్ వెళ్లే నవజీవన్ ఎక్స్‌ప్రెస్ 3 గంటలు ఆలస్యంగా నడిచాయి. అలాగే చెన్నై సెంట్రల్ నుంచి విశాఖపట్నం వెళ్లే ప్రత్యేక రైలు 2.40 నిమిషాలు ఆలస్యం కాగా, సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు ఉదయం 10 గంటలకు బయలుదేరి వెళ్లే మెమూ రైలు 2 గంటలు ఆలస్యంగా వెళ్లింది. మరికొన్ని సూపర్‌ఫాస్ట్ రైళ్లు తడ, ఎలావూరు, గుమ్మిడిపూడి, పోలిరెడ్డిపాళెం, దొరవారిసత్రం, నాయుడుపేట, పెద్దపరియ స్టేషన్లలో గంటల కొద్ది నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



నాయుడుపేటలో ఆగిఉన్న పినాకిని ఎక్స్‌ప్రెస్

శ్రీవారి ఆలయ శుద్ధి

తిరుమల, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ఆలయ శుద్ధి జరిగింది. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముందు వచ్చే మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆనంద నిలయం నుంచి బంగారు వాకిలి, ఉప ఆలయాలు, ప్రసాదాల పోటు, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పుతో పాటు పూజా సామగ్రిని శుద్ధి చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పూజాసామగ్రి తీసుకొస్తున్న టీటీడీ ఛైర్మన్, ఈవో తదితరులు

అడవిలో మృతులు తమిళనాడువాసులు

- తాజాగా గోతిలో కనిపించిన ఇద్దరు చిన్నారుల శవాలు
- భార్య, పిల్లల మృతదేహాలను గుర్తించిన భర్త
- నలుగురినీ ఎవరో హత్య చేసినట్లు అనుమానం?





కలై సెల్వన్ - జయమాల (ఫైల్‌ఫొటోలు)



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చంద్రగిరి/ పాకాల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పాకాల వారిపల్లె అటవీ ప్రాంతంలో మంగళవారం బయటపడిన మృతదేహాలు తమిళనాడుకు చెందిన వారివిగా నిర్ధారణ అయింది. ఆదివారం సాయంత్రం ఈ అడవిలో ఓ పురుషుడు శవం చెట్టుకు వేలాడుతుండటం, ఓ మహిళ మృతదేహం సమీపాన పడి ఉండటం, అక్కడే పూడ్చిపెట్టిన రెండు గోతులను పోలీసులు గుర్తించిన సంగతి తెలిసిందే. గోతుల్లో ఇద్దరు చిన్నారులను పూడ్చిపెట్టి ఉంటారని పోలీసులు భావించారు. సోమవారం పురుషుడు, మహిళల శవాల పోస్టుమార్టం, ఖనన ప్రక్రియతో చీకటి పడిపోయింది. ఈక్రమంలో మంగళవారం పోలీసులు అడవికి చేరుకుని రెండు గోతులను కొంతమేర తవ్వారు. గోతిలో మొబైల్ ఫోన్, డెయిరీ మిల్క్ చాక్లెట్, పాన్ కార్డు, ఆధార్ కార్డు, నగదుతో పాటు చిన్నారుల మృతదేహాలున్నట్లు గుర్తించారు. సాయంత్రం కావడంతో గోతులను పూర్తిగా తవ్వలేకపోయారు. ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో బుధవారం ఉదయం పూర్తిగా తవ్వి, మృతదేహాలను వెలికి తీయనున్నట్లు పోలీసులు తెలిపారు.

మందుల చీటీనే క్లూ

రెండు రోజుల క్రితం సంఘటనా స్థలం వద్ద మందుల చీటీ పాకాల పోలీసులకు దొరికింది. ఈ క్లూ ఆధారంగా వారు దర్యాప్తు చేపట్టారు. ఆ ప్రిస్క్రిప్షన్ తమిళనాడులోని తంజావూరు వైద్యుడు రాసిందిగా గుర్తించి అక్కడి పోలీసులకు సమాచారమిచ్చారు. వారు సదరు వైద్యుడ్ని ఆరా తీశారు. కలైసెల్వన్ అనే వ్యక్తి మానసిక స్థితి సరిగా లేక తన దగ్గర వైద్యం పొందుతున్నాడని ఆ వైద్యుడు తెలిపారు. ఈఏడాది జూలైలో తిట్టచ్చేరి పోలీస్ స్టేషన్‌లో పరిధిలోని వెంకటేశ్ అనే వ్యక్తి తన భార్య జయమాల, కుమార్తెలు హర్షిణి(7), దర్శిణి(3) కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇతడు కుటుంబ పోషణ కోసం కువైట్‌లో ఉండేవాడు. అడవిలో శవాల సమాచారంతో అతడ్ని తమిళనాడు పోలీసులు మంగళవారం తీసుకొచ్చారు. సంఘటనా స్థలంలో ఉన్నది తన భార్య జయమాల మృతదేహమని వెంకటేష్ గుర్తించారు. మరో మృతుడు తన సమీప బంధువు కలైసెల్వన్(37)గా పేర్కొన్నారు. దీంతో మృతులెవరనేది నిర్ధారణ అయింది. మృతులకు నోట్లో గుడ్డలు కుక్కి, పార్శిల్ టేప్ చుట్టినట్లు ఉండటంతో పోలీసులు హత్యగానే భావిస్తున్నారు. లోతైన దర్యాప్తులో వీరి మృతికి సంబంధించి మిస్టరీ వీడుతుందని చెబుతున్నారు.

మళ్లీ బాంబు బెదిరింపు మెయిల్స్

- ఈసారి లిటిల్ ఏంజెల్స్ స్కూల్‌కు..
- ఫేక్ మెయిల్‌గా తేల్చిన బీడీ టీమ్



లిటిల్ ఏంజెల్స్ స్కూలులో తనిఖీలు చేస్తున్న పోలీసులు, బాంబు స్క్వాడ్ సిబ్బంది

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మీ హోటళ్లలో బాంబులు పెట్టాం.. పేల్చేస్తామంటూ గతేడాది అక్టోబరు 24న మొదలైన బెదిరింపు ఈ మెయిల్స్ ఇప్పటికీ కొనసాగుతున్నాయి. తాజాగా తిరుపతి నగరం రైల్వే కాలనీలోని లిటిల్ ఏంజెల్స్ స్కూల్‌కు ఆ తరహా మెయిల్ వచ్చింది. ఈ స్కూల్‌లో బాంబులు పెట్టామని త్వరలో పేలతాయంటూ మంగళవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో తమిళనాడు నుంచి రజాక్ హాట్ మెయిల్ నుంచి స్కూల్ మెయిల్‌కి సందేశం పంపారు. దీనిపై పాఠశాల కరస్పాండెంట్ అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ భక్తవత్సలం పర్యవేక్షణలో అలిపిరి సీఐ రాంకిషోర్, ఎస్ఐ అజిత, బాంబు డిస్పోజల్ స్క్వాడ్ సిబ్బంది ఘటనా స్థలికి వెళ్లి బాంబు డిస్పోజల్ పరికరాలతో పాఠశాలతో పాటు ప్రిన్సిపాల్ చాంబర్, తరగతి గదులు, ప్రాంగణమంతా తనిఖీలు చేశారు. డాగ్ స్క్వాడ్ సిబ్బందీ పరిశీలించారు. దాదాపు గంట పాటు జరిగిన తనిఖీల్లో ఎలాంటి బాంబులు లేవని, ఫేక్ మెయిల్‌గా తేల్చారు. దీనిపై అలిపిరి సీఐ కేసు నమోదు చేశారు.కాగా, 11నెలల కిందట తొలుత నాలుగు హోటళ్లకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ఆ తర్వాత అక్టోబరు 27న ఇస్కాన్ టెంపుల్‌కు, మరో ఐదు హోటళ్లకూ.. డిసెంబరు 13న వ్యవసాయ కళాశాలకు.. ఈ ఏడాది మార్చి 21న కలెక్టరేట్‌కు.. మే 28న మళ్లీ కలెక్టరేట్‌కు.. వ్యవసాయ కళాశాలకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. కొంతకాలం ఆగాక.. మళ్లీ బాంబు మెయిల్ వచ్చింది.

డిజిటల్ మారథాన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్,సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్ర యువ సంకల్ప్ 2కె25 రాయబారి డిజిటల్ మారథాన్'కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్ తెలిపారు. వికసిత్ భారత్‌లో భాగంగా సామాజిక బాధ్యత, కుటుంబ సంబంధాలు, ఆరోగ్యకరమైన జీవనం, బాధ్యతాయుత డిజిటల్ ఆవిష్కరణల ప్రోత్సాహానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. 18-35 ఏళ్ల మధ్య వయస్కులు తాము చేపట్టిన కార్యక్రమాలపై 120సెకన్ల నిడివి గల వీడియోలను సొంత సామాజిక మాధ్యమాల్లో చూపించి అధికారిక హాష్‌టాగ్‌లతో పోస్టు చేయాలన్నారు. ఉత్తమమైన మూడింటిని ఎంపికచేసి రూ.లక్ష, రూ.75వేలు, రూ.50వేల బహుమతి ఇస్తారన్నారు. 9మంది విజేతలకు ఆంధ్ర యువత బ్రాండ్ అంబాసిడర్ గా సత్కరిస్తారు. ఆసక్తి గల వారు 'ఆంధ్రయువసంకల్ప్.కామ్' వెబ్‌సైట్‌లో పేర్లను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9848543976 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.






మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యేలు పులివర్తి నాని, భానుప్రకాష్ - సుబ్రమణ్యం నాయుడు (ఫైల్ ఫొటో)

డీసీఎంఎస్ ఛైర్మన్ కన్నుమూత

- ఎమ్మెల్యేలు, టీడీపీ శ్రేణుల నివాళులు

చంద్రగిరి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీ గడ్డంవారిపల్లెకు చెందిన డీసీఎంఎస్ ఛైర్మన్ పల్లినేని సుబ్రమణ్యంనాయుడు మంగళవారం ఉదయం మృతి చెందారు. కొన్ని రోజులుగా శ్వాసకోశ వ్యాధితో ఇబ్బంది పడుతున్న ఆయన చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అసువులు బాశారు. ఈయన మృతదేహాన్ని ఎమ్మెల్యే పులివర్తి నాని దగ్గరుండి చెన్నై నుంచి స్వగ్రామానికి తీసుకొచ్చారు. మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరం జంక్షన్‌కు మృతదేహం చేరుకుంది. అక్కడ్నుంచి మండలంలోని నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ ద్వారా చంద్రగిరి మీదుగా గడ్డంవారిపల్లెకు మృతదేహాన్ని తీసుకెళ్లారు. ఈయన గతంలో రెండు పర్యాయాలు మండల పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఐతేపల్లె సింగిల్‌విండో ఛైర్మన్‌గా పనిచేసి, ప్రస్తుతం డీసీఎంఎస్ ఛైర్మన్‌గా ఉన్నారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కార్యకర్తలకు అండగా ఉన్నారు. పార్టీ విజయానికి కృషి చేశారు. ఈయన మృతి పార్టీకి తీరనిలోటని నేతలు పేర్కొన్నారు. చంద్రగిరి, నగరి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, భానుప్రకాష్, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి హేమాంబరధరరావు, నేతలు కుమారరాజారెడ్డి, ముడిపల్లె సురేష్‌రెడ్డి, పారిశ్రామికవేత్త ఏవీ రమణమూర్తి, ఈశ్వర్‌రెడ్డి, శుభగిరి, శ్రీధర్‌నాయుడు, అనిమిని మధు, దేవానందనాయుడు తదితరుల నివాళులర్పించారు.

జలజల జాలువారంగ..!





తిరుపతిలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో శేషాచల కొండల్లో నుంచి మాల్వాడిగుండం ప్రవహించింది. కపిలతీర్థంలోకి జలజలమంటూ జలపాతం దూకుతూ కనువిందు చేసింది.

పుత్తూరు వార్తలు

పవిత్రోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ



పుట్టమట్టికి పూజలు చేస్తున్న వేదపండితులు

వడమాలపేట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరగనున్న పవిత్రోత్సవాలకు మంగళవారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణం జరిగింది. ఈ సందర్భంగా మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం నిర్వహించారు. పుట్టమట్టిని మేదినీ దేవి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదామంత్రలతో అంకుర్పారణ నిర్వహించారు. తెలిసీ, తెలియక జరిగే దోషాల నివారణ కోసం బ్రహ్మోత్సవాల అనంతరం పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. మొదటి రోజు బుధవారం పవిత్రాల ప్రతిష్ఠ, గురువారం పవిత్రాల సమర్పణ, పవిత్ర హోమాలు చేపడతారు. చివరిరోజు శుక్రవారం మహాపూర్ణాహుతి నిర్వహించనున్నారు. పవిత్రోత్సవాల సందర్భంగా ప్రతి రోజు ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు.

నేడు రాయితీపై ఎర్రగడ్డల పంపిణీ



పుత్తూరు టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మామిడి కాయల మార్కెట్ యార్డు లో ఈ నెల 17న రాయితీపై ఎర్రగడ్డలు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు గణేష్ తెలిపారు. ప్రభుత్వం నుంచి సుమారు 5400 కిలోల ఎర్రగడ్డలు వచ్చాయని తెలిపారు. కిలో రూ.10లకు ఉదయం 10 గంటలనుంచి విక్రయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యులు బాబు నాయుడు, రమేష్, ఉమాశంకర్ రెడ్డి, కార్యదర్శి తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు



సీనియర్ బాలురు, బాలికల విన్నర్స్ జట్లు

పుత్తూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల స్థాయి క్రీడాపోటీల్లో వివిధ విభాగాల్లో విజేతలను ప్రకటించారు. కబడ్డీ సీనియర్ బాలుర విభాగంలో ప్రభుత్వ తమిళ ఉన్నత పాఠశాల విన్నర్‌గా, వేదవ్యాస ఉన్నత పాఠశాల రన్నర్‌గా, బాలికల సీనియర్ విభాగంలో గేట్ పుత్తూరు ఉన్నత పాఠశాల విన్నర్‌గా, పిళ్లారిపట్టు ఉన్నత పాఠశాల రన్నర్‌గా నిలిచాయి. ఇక బాలికల జూనియర్ విభాగంలో కేబీఆర్‌పురం విన్నర్‌గా, నారాయణ పాఠశాల రన్నర్‌గా నిలిచాయి. ప్రతిభ కనపరచిన క్రీడాకారులతో జిల్లా జట్టును ఎంపిక చేశామని కోఆర్డినేటర్ గోపికృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు జయప్రకాష్, గుర్రప్ప, కేశవులు, సుబ్రమణ్యం, రేఖారాణి, గోవిందమ్మ పాల్గొన్నారు.

యూటీఎఫ్ రణభేరి

పుత్తూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగుల ఆర్థిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు సోమవారం రాత్రి బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ, డీఏ బకాయిలను పట్టించుకోవాలని కోరారు. ఈనెల 20న గుంటూరులో రాష్ట్ర స్థాయి ఉద్యమం చేపడతామని శ్రీనివాసరావు, నాయుడు, మణిగండన్, గీత, దాసరి మునెయ్య తెలిపారు.

ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు



జరిమానా విధిస్తున్న మున్సిపల్ అధికారులు

పుత్తూరు అర్బన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో ప్లాస్టిక్ నియంత్రణకు దుకాణాలు, హోటళ్లలో మున్సిపల్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లకు జరిమానా విధించారు. నిబంధనలు అతిక్రమిస్తే రూ.5 వేల నుంచి రూ.25 వేల వరకు జరిమానాతోపాటు ట్రేడ్ లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు.

శాస్త్రోక్తంగా మహా రుద్రాభిషేకం



వడమాలపేట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భవానీ శంకర దేవాలయంలో మహాశివుడి జన్మ నక్షత్రం ఆరుద్రను పురస్కరించుకుని మహా రుద్రాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం సదాశివుడి మహాలింగానికి రుద్ర గమకాలు పఠిస్తూ మహా రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు.

స్కూల్ గేమ్స్ విజేత వడమాలపేట



వడమాలపేట,సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్ -14, 17 విభాగాల్లో బాలబాలికలకు వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. అండర్ 14, 17 బాలబాలికల వాలీబాల్, కబడ్డీ విభాగాల్లో వడమాలపేట విజేతగా, తడుకు ఉన్నత పాఠశాల, ఎస్‌బీఆర్ పురం ఉన్నత పాఠశాలలు రన్నర్స్‌గా నిలిచాయి. గెలుపొందిన జట్ల నుండి మండల జట్టును ఎంపిక చేయడం జరిగింది. ఈ జట్లు డివిజన్ స్థాయిలో జరిగే పోటీలలో వడమాలపేట మండలం తరపున పాల్గొంటారు.

పేదల పక్షపాతి బొజ్జా తారకం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పేదల పక్షపాతి బొజ్జా తారకం అని పలువురు వక్తలు కొనియాడారు. దళిత, హక్కుల ఉద్యమ నేత బొజ్జా తారకం 9వ వర్ధంతి సభ తిరుపతిలో మంగళవారం నిర్వహించారు. రిటైర్డు జడ్జిలు గుర్రప్ప, ఆనంద్, సీఐటీయూ నేత కందారపు మురళి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విజయకుమార్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, ఆర్పీఐ అధ్యక్షుడు అంజయ్య, లాయర్ సంపూర్ణమ్మ తదితరులు ప్రసంగించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ఫ్లెక్సీల చించివేతపై ఫిర్యాదు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) సొసైటీ అభినందన సభకు కోళ్లమిట్ట ప్రాంతంలోని మన్నెముత్తేరి సర్కిల్ వద్ద తాను ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను మరో వర్గానికి చెందిన వ్యక్తులు చించేశారని రైతుసేవా సహకార సంఘ అధ్యక్షుడు ఏజీ బాలచంద్ర కిషోర్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పూరిగుడిసె దగ్ధం

తడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధమైంది. మండల పరిధిలోని ఇరకంకుప్పం దీవిలో ఒంటరిగా నివాసం ఉంటున్న చిన్నపొన్నుకు చెందిన పూరిగుడిసెలో మంగళవారం మధ్యాహ్నం సమయంలో షార్ట్ సర్క్యూట్ జరిగి నిప్పు అంటుకుంది. గాలులు వీస్తుండటంతో మంటలు వేగంగా వ్యాపించి నిమిషాల వ్యవధిలోనే గుడిసె మొత్తం కాలిబూడిదైంది. ఈ ప్రమాదంలో ఇంటిలోని వస్తువులు పూర్తిగా కాలిపోయాయి.

ద్విచక్ర వాహనాల చోరీ ముఠా అరెస్టు

ఐదుగురి పట్టివేత ● 11 బైక్‌ల స్వాధీనం



పట్టుబడ్డ బైక్‌లతో సీఐ మురళీకృష్ణ, సిబ్బంది

తడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలను చోరీ చేసే ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఐదుగురిని అరెస్టు చేసి, 11 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల తడ ప్రాంతంలో బైక్‌లు చోరీకి గురవుతుండటంతో పోలీసులు నిఘా పెట్టారు. మంగళవారం ఐదుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అదుపులో తీసుకొని విచారించగా, బైక్‌లను చోరీ గుట్టురట్టైంది. పట్టుబడ్డ ఐదుగురిలో రౌడీషీటర్ కుదిరి సాయి విఘ్నేష్ అలియాస్ బబ్లు, అలియాస్ కేఎఫ్‌తో పాటు వరదయ్యపాళెం మండలం తొండూరు సొసైటీకి చెందిన పాళెంగోపాల్ అలియాస్ ప్రశాంత్, తడ మండలం వేనాడు గ్రామానికి చెందిన వెట్టి రాకేష్ అలియాస్ రాఖీ, సత్యవేడు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన తొండా మునిశేఖర్ అలియాస్ గన్, సూళ్లూరుపేట మండలం కొమ్మినేనిపల్లికి చెందిన బందిలి సూర్యనారాయణ అలియాస్ మిరపకాయలుగా గుర్తించారు. వారిచ్చిన సమాచారంతో 11 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరో ఇద్దరిని అరెస్టు చేయాల్సి ఉందని, ప్రస్తుతం వారు మరో కేసులో నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్నారని సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ తెలిపారు.

అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం: విజయశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకుసాగుతున్నదని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలోని శ్రీనివాస ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధ్యక్షులు, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రైతు శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. సహకార సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేయడంతో పాటు రాయితీపై విత్తనాలు, ఎరువులు అందజేయడం జరుగుతోంద న్నారు. రైతులకు కావాల్సిన యూరియాను పూర్తిస్థాయిలో అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం నాయుడుపేట పీఏసీఎస్ అధ్యక్షుడిగా ప్రభాకర్ నాయుడు, డైరెక్టర్లుగా పరంధామయ్య, నారాయణ, అన్నమేడు సొసైటీ అధ్యక్షుడిగా రామచంద్రారెడ్డి, డైరెక్టర్లుగా నాగరాజు, మునస్వామి, ఓజిలి మండలం కుందాం సొసైటీ అధ్యక్షుడిగా పురుషోత్తమరాజు, డైరెక్టర్లుగా బాలగురునాథం, వెంకటయ్య, కురుగొండ సొసైటీ అధ్యక్షుడిగా అంకయ్య, డైరెక్టర్లుగా మల్లికార్జునరెడ్డి, రవీంద్ర రాజు, పెళ్లకూరు మండలంలోని చిల్లకూరు సొసైటీ అధ్యక్షుడిగా కేవీ నాయుడు, డైరెక్టర్లుగా గోపాలకృష్ణ, రామకృష్ణారెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఎన్‌డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనంజయరెడ్డి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, నాయుడుపేట, సూళ్లూరుపేట ఏఎంసీ చైర్మన్లు ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, ఆకుతోట రమేష్, టీడీపీ నాయకులు రఫీ, సుధాకర్‌రెడ్డి, విజయకుమార్ నాయుడు, అశోక్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సంచి కృష్ణయ్య, మురళీకృష్ణారెడ్డి, శివకుమార్ మొదలియార్, గోపాలకృష్ణ, ప్రభాకర్ నాయుడు, షైలారి రాజశేఖర్, మల్లికార్జునరెడ్డి, నాగేంద్రరెడ్డి, పసల గంగాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌పై అవగాహన పెంచుకోవాలి: పాశిం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సోలార్ విద్యుత్ వాడకంపై అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన సోలార్ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ వినియోగదారులకు బిల్లులను ఆదా చేసుకునేందుకు సోలార్ వ్యవస్థపై అవగాహన కల్పించడంతో పాటు రాయితీ అందజేస్తున్నాయన్నారు. ప్రజలు ఈ పథకాన్ని వినియోగించుకుని విద్యుత్ బిల్లులను ఆదా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, అబ్దుల్ రహీం, బిల్లు చెంచురామయ్య, వెంకటేశ్వర్లురాజు, వాటంబేడు శివకుమార్, పెంచలయ్య, మోహన్, నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు వద్దు: యూటీఎఫ్



నాయుడుపేటలో యూటీఎఫ్ రణభేరి జాత

నాయుడుపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించవద్దని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించి, సమస్యలను పరిష్కరించాలంటూ యూటీఎఫ్ తిరుపతి నుంచి చేపట్టిన రణభేరి మంగళవారం నాయుడుపేటకు చేరుకుంది. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించడం వల్ల పాఠశాలల్లో విద్యా బోధనకు ఆటంకం కలుగుతుందన్నారు. అలాగే 12వ పీఆర్సీని నియమించడంతో పాటు 30శాతం మధ్యంతర భృతిని ప్రభుత్వం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి ముత్యాలురెడ్డి, గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య, నిర్మల, కంజర్ల శేఖర్, మధు, విజయశ్రీ, సుబ్బారావు, శ్రీనివాసులు, శివప్రసాద్, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: యూటీఎఫ్ రణభేరికి సూళ్లూరుపేట మండలంలోని మన్నారుపోలూరు హైస్కూల్ వద్ద ఘనంగా స్వాగతం పలికారు. అక్కడ నుంచి ఆర్టీసీ బస్టాండు వద్దకు చేరుకుని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హోలిక్రాస్ సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు నాయుడు, జీజే రాజశేఖర్, నిర్మల, ప్రభాకర్ మధు, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్: యూటీఎఫ్ రణభేరి ఆధ్వర్యంలో పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యారంగంలో చేసిన ప్రయోగాలు దుష్పరిణామాలకు దారి తీశాయని, వాటిని కూటమి ప్రభుత్వం సరిదిద్దాలన్నారు. అలాగే పీఆర్సీని నియమించడంతో పాటు 29 శాతం మధ్యంతర భృతి మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుమారస్వామి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు విడతల కరువు భత్యం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో దేవరాల నిర్మల, రామచంద్రయ్య, ఉదయ్ కుమార్, మధు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకే పీ-4

గూడూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన కోసం సీఎం చంద్రబాబునాయుడు పీ-4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా అన్నారు. మంగళవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వివిధశాఖల అధికారులతో పీ-4 కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజాభివృద్ధి కోసం అందరి సహకారంతో విద్య, ఉపాధి తదితర అంశాలను అభివృద్ధి పరిచేలా పలువురిని భాగస్వాములను చేస్తూ పీ-4 కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెళ్లకూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్వాయిపాడు వద్ద జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... ప్రకాశం జిల్లా తకెళ్లపాడు గ్రామానికి చెందిన రంపతేటి శ్రీనివాసరావు (31) శ్రీకాళహస్తి వైపు మోటార్ బైక్‌పై వెళ్తుండగా తాళ్వాయిపాడు సర్వీస్‌రోడ్డు వద్ద అదుపుతప్పి కింద పడిపోయాడు. హెల్మెట్ తల నుంచి విడిపోవడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడికే మృతి చెందాడు. ఎస్ఐ నాగరాజు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో వద్ద మంగళవారం ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. డిపో వద్ద జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు సాల్మన్, శేఖర్, మన్యం తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పౌష్టికాహారం పంపిణీ

గూడూరు అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో మంగళవారం కేవీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో మ్యాన్‌కైండ్ ఫార్మసీ సహకారంతో వృద్ధులకు నిత్యావసరాలను, పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ త్రివిక్రమ్, డాక్టర్ కీర్తి, శేషాద్రి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు గడువు పొడిగింపు

కోట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు బాలికల ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు గడువును ఈనె 27వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9492751613, 9441859490 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

జెండా ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

గూడూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంజనేయస్వామి జెండా పండుగ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో జెండా ఉత్సవ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన నిర్వహించనున్న ఆంజేయ స్వామి జెండా ఉత్సవాలకు తప్పనిసరిగా పోలీసుల నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని, బాణసంచా కాల్చకూడదన్నారు. ఊరేగింపు సమయంలో ట్రాఫిక్‌కు అంత రాయం కలగకుండా సహకరించాలన్నారు. శాంతి భద్రతలకు ఉత్సవ కమిటీ సభ్యులే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఉత్సవాల్లో ఎవరైనా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ షాజహాన్, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

పెళ్లకూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జన్మదినాన్ని పురష్క రించుకుని బుధ వారం పెళ్లకూరు ప్రాథ మిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి కోరారు.

రాజరాజేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ

కోట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చిట్టేడులో రాజరాజేశ్వరి అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠ మంగళవారం జరిగింది. స్థానిక నాగేంద్ర ఆచార్య మఠం ప్రతినిధి చిదానంద వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

గూడూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధికి సునీత సేవాసంస్థ కృషి చేస్తుందని సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణను పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు తమ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇచ్చి, వారు ఆర్థిక స్వాలంబన సాధించేలా తోడ్పాటునందిస్తున్నామన్నారు.

డ్రోన్‌తో నిఘా

వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐఐహెచ్‌టీ, వల్లివేడు క్రాస్‌రోడ్డు ప్రాంతాల్లో పోలీసులు డ్రోన్ నిఘా వేశారు. బహిరంగ ప్రాంతాల్లో మద్యం తాగితే చర్యలు తీసుకుంటామని సీఐ రమణ అన్నారు.

చిల్లకూరు సొసైటీ చైర్మన్‌కు సన్మానం



కేవీ నాయుడిని సన్మానిస్తున్న నరేంద్రరెడ్డి

పెళ్లకూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరు సొసైటీ చైర్మన్ కొచ్చర్ల వెంకటరమణయ్య నాయుడు(కేవీ నాయుడు)ను బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో కూటమి నాయకులు ఘనంగా సత్కరించారు. మంగళవారం నాయుడుపేటలో జరిగిన కార్యక్రమంలో కేవీ నాయుడు చిల్లకూరు సొసైటీ చైర్మన్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయనను ఎద్దల నరేంద్రరెడ్డి శాలువ కప్పి సన్మానించారు. రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ సొసైటీని అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కలిచేటి నరసింహులు, మాజీ అధ్యక్షుడు గోగుతోటి మురళి, రమణ, భరత్, సునీల్, మద్దాలి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాలను మెరుగుపరిచేందుకే పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీవైఈవో సనత్‌కుమార్

చిల్లకూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు పోటీలు నిర్వహిస్తున్నామని డీవైఈవో సనత్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి పోటీలు నిర్వహించారు. ఇక్కడ గెలుపొందిన వారిని డివిజన్‌స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంవో శశశంకర్, సుధీర్, ఎంఈవో రవూఫ్, హెచ్ఎం జ్యోతి, పీడీ శ్రీనివాసులు, మల్లికార్జున్, బుజ్జిబాబు, వాసుదేవయ్య పాల్గొన్నారు.

మండలస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

కోట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కోటలోని ఎవీకేఆర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. తహసీల్దారు జయజయరావు, ఎంఈవోలు మస్తానయ్య, శిరీష పోటీలను ప్రారంభించారు. టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, జలీల్ అహ్మద్, దారా సురేష్, షంషుద్దీన్ పరుగుపందెంలో పాల్గొని క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు.

భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు తిరుపతి వ్యవసాయశాఖ ఏవో శ్రీనివాసులు, వెంకటగిరి ఏవో సుజాత భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా నానో యూరియా, నానో డీఏపీ, బయోఫెర్టిలైజర్స్ గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కవిత, వ్యవసాయశాఖ అధికారులు పుష్పావతి, కల్యాణబాబు, సుజాత, రాజీవన తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలి



అధికారులను నిలదీస్తున్న సర్పంచ్ మస్తాన్

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలిని ఎంపీపీ తంబిరెడ్డి తనూజాశివా రెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. అమ్మపాళెం సర్పంచి మస్తాన్ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలపై ప్రజలు నిలదీస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారో తెలియడం లేదన్నారు. అన్నదాత సుఖీభవ చాలామందికి జమ కాలేదని, దీనిపై ఎవరిని అడగాలో తెలియక రైతులు ఇబ్బందిపడుతున్నారని, వీఆర్వోలు, వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉండడం లేదన్నారు. తమ గ్రామంలో ఆర్బీకే ఏడాదిన్నరగా మూతవేసి ఉందన్నారు. ఉపాధి కూలి పనులు చేస్తుంటే ఇరిగేషన్ అధికారులు అడ్డుకుంటున్నారని, దీనికి పరిష్కారం చూపించాలన్నారు. అనంతరం జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాథం, ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యూరియా గోదాములపై విజిలెన్స్ దాడులు

కోట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని పలు యూరియా గోదాములపై మంగళవారం విజిలెన్స్ అధికారులు దాడులు జరిపారు. విజిలెన్స్ ఏవో రామాంజనేయరెడ్డి, విజిలెన్స్ హెడ్ కానిస్టేబుల్ వెంకటాద్రి స్థానిక గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలని, ఎక్కడైనా తేడాలు వస్తే సంబంధిత ఎరువుల దుకాణ డీలర్లపై కేసుల నమోదుతో పాటు లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏవో సుచేంద్రప్రసాద్, వ్యవసాయ విస్తరణాధికారి సాయికుమార్, సహాయ వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



యూరియా గోదామును తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

నేడు విమానాశ్రయంలో యాత్రి సేవా దివస్

● ఎయిర్‌పోర్టు డైరెక్టర్ భూమినాథన్


వివరాలు వెల్లడిస్తున్న భూమినాథన్

రేణిగుంట, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులను ఆకర్షించే విధంగా విమానాశ్రయంలో యాత్రి సేవా దివస్ నిర్వహిస్తున్నట్లు తిరుపతి ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ భూమినాథన్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం పాత విమానాశ్రయం కార్యాలయ భవనంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు తిరుపతి విమానాశ్రయంలో ఈనెల 17న బుధవారం ఎస్వీ సంగీత కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. వృద్ధులతో మొక్కలు నాటించడం, రక్తదాన శిబిరం, డ్రైవర్లకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. చిన్న పిల్లలను ఆకర్షించే విధంగా క్విజ్, పెయింటింగు పోటీలు జరుగుతాయన్నారు. సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏవియేషన్ రంగంలో విభాగాలపై స్థానిక విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని, అలాగే విమానాశ్రయంలో ప్రతి విభాగాన్ని సందర్శించవచ్చని తెలిపారు. విమానాశ్రయ హెచ్‌ఆర్ కేశవ్, టెర్మినల్ మేనేజర్ మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజేపీబీలో ఎస్‌జీఎఫ్ పోటీలు ప్రారంభం


ఎంజేపీబీ విద్యార్థులతో ఉపాధ్యాయులు- పిచ్చాటూరులో జరిగిన క్రీడాపోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సత్యవేడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహాత్మ జ్యోతీబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో ఎంఈవో రవి, ప్రిన్సిపాల్ సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలను ప్రారంభించారు. అండర్-14, 17 విభాగాల్లో వాలీబాల్ పోటీలను జరిగాయి. ఈ పోటీలకు మండంలోని దాసుకుప్పం. మదనంబేడు, సత్యవేడు జడ్పీ హైస్కూల్, ఎంజేపీబీ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ అండర్ 14, 17 విభాగాల్లో ఎంజేపీబీ విద్యార్థులు విజయం సాధించగా, వాలీబాల్ అండర్ 14 విభాగంలో సత్యవేడు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు, అండర్- 17లో దాసుకుప్పం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు విజయం సాధించారు. ఎంఈవో 2 ఉష, పీఈటీలు పాల్గొన్నారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం ఎస్‌జీఎఫ్ అండర్-14,17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా, బాల్‌బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ క్రీడా పోటీలను ప్రారంభించారు.ఎంఈవోలు హేమమాలిని, యుగంధర్‌రాజు, పీఈటీలు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): మండలం నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లో విద్యార్థులు రాణించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో మోతి కోరారు. బీఎన్‌కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. పల్లమాల, బుచ్చినాయుడుకండ్రిగ, నెలవాయి, కల్లివెట్టు, చల్లమాంబపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యంలు, హెచ్‌ఎంలు రమణయ్య, హరిప్రియ, గాయత్రి, పీడీలు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కలలు సాకారం చేయండి


విద్యార్థులతో మాట్లాడుతున్న భరత్‌కుమార్‌రెడ్డి

ఏర్పడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వసతిగృహాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదిగి తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి భరత్‌కుమార్‌రెడ్డి సూచించారు. జిల్లా సహాయ బీసీ సంక్షేమ అధికారి జ్యోత్స్నతో పాటు ఏర్పేడు, రేణిగుంట పట్టణాల్లోని బీసీ సంక్షేమ వసతిగృహాలను మంగళవారం రాత్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హాస్టళ్లలో కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులు బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలన్నారు. మంచిఫలితాలు సాధించాలని సూచించారు. మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఏర్పేడు, రేణిగుంట2 సంక్షేమ వసతిగృహాల్లో అభివృద్ధి పనులు జరుగుతుండటంతో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పల్లా వెంకటేశ్వర్లును అభినందించారు. విద్యార్థుల ప్రగతికి అవసరమైన మెలకువలు, సూచనలు ఇచ్చారు.

మౌలిక వసతుల కల్పనపై దృష్టి

నారాయణవనం, సెప్టెంబర్ 16(ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధిపై దృష్టి సారించాలని డిప్యూటీ ఎంపీడీవో వీనయ్య పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో 15 ఆర్థిక సంఘ నిధులకు సంబంధించి కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. తాగునీరు, వీధి దీపాలు, చెత్త సేకరణకు ట్రైసైకిళ్ల సమకూర్చుకోవడంపై చర్చించారు.

వామ్మో... వీధి కుక్కల బెడద!


ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డులో వీధి కుక్కల సంచారం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈ చిత్రం చూడండి... శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డులో వీధి కుక్కల సంచారం ఇది. పట్టణంలో వీధి కుక్కల బెడద వెంటాడుతోంది. వీధి కుక్కల సంతతి పై నియంత్రణ లేకపోవడంతో పట్టణంలో ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. పట్టణవ్యాప్తంగా ఇదే సమస్య స్థానిక ప్రజలను బెంబేలెత్తిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రి మార్గంలో మంగళవారం కనిపించిన దృశ్యం ఇది. ఈ ప్రాంతంలో అన్న క్యాంటీన్, ఆర్‌అండ్‌బీ కార్యాలయం, అతిథిగృహం, పలు ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికలు, బాలుర జూనియర్ కళాశాలలు న్నాయి. అలాగే ప్రభుత్వాస్పత్రితో పాటు బాలుర సమీకృత వసతిగృహం, విద్యుత్ ఉపకేంద్రం, 9వ వార్డు సచివాలయం, పెద్ద ఎత్తున నివాస గృహాలున్నాయి. ఇంతటి జనసంచారం ఉండే రోడ్డులో వీధి కుక్కలు పై నియంత్రణ లేదు. దాంతో ఈ ప్రాంతంలో రాకపోకలు సాగిస్తున్న విద్యార్థులు, పాదచారులపై కుక్కలు దాడి చేస్తున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి శ్రీకాళహస్తి పట్టణవ్యాప్తంగా వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పరశురామేశ్వరుడి సేవలో ఇంటెలిజెన్స్ డీఎస్పీ

ఏర్పేడు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరస్వామిని మంగళవారం ఇంటెలిజెన్స్ డీఎస్పీ సాయిరాం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆయనను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు రక్తదాన శిబిరం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈనెల 17న బుధవారం పట్టణంలోని సరస్వతి ఆడిటోరియంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు బీజేపీ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలిపారు. ఉదయం 8 నుంచి జరుగుతుందని, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

సింగిల్ విండో చైర్మన్ల ప్రమాణ స్వీకారం


సమావేశంలో మాట్లాడుతున్న మహేష్‌రెడ్డి - సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఏర్పేడు సింగిల్ విండో చైర్మన్‌గా కందాటి మహేష్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సుధీర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తన తండ్రి, మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి అడుగుజాడల్లో నడిచి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. సభ్యురాలిగా గాలి కృష్ణవేణి ప్రమాణస్వీకారం చేశారు. మరో సభ్యుడు మునిశేఖర్ హాజరు కాలేదు. శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ అబ్జర్వర్ అంకయ్యచౌదరి, నాయకులు గురవారెడ్డి, ధనంజయులు నాయుడు, పొన్నారావు, శివశంకర్‌రెడ్డి, బొడుగు మునిరాజాయాదవ్, మోహన్‌రావు, నాగరాజు నాయుడు, కృష్ణవేణి, సింగిల్‌విండో సీఈవో వేములయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం వ్యాసాశ్రమాన్ని ప్రక్షాళన చేయాలని స్థానికులు ఎమ్మెల్యే సుధీర్‌కి విజ్ఞప్తి చేశారు.

తంగేళ్లపాళెం సింగిల్ విండో చైర్మన్...

శ్రీకాళహస్తి (ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం తంగేళ్లపాళెం సింగిల్ విండో చైర్మన్‌గా భాస్కర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు మంగళవారం శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని పిచ్చాటూరు రహదారికి ఆనుకుని ఉన్న సింగిల్ విండో కార్యాలయంలో ప్రమాణ స్వీకారం వేడుకగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే సుధీర్‌కు చైర్మన్, సభ్యులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే సమక్షంలో సింగిల్ విండో కమిటీ బాధ్యతల స్వీకరణ జరిగింది. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కోసం ఎన్నో ప్రోత్సాహకాలను అమలు చేస్తోందన్నారు. టీడీపీ నాయకుడు రంగినేని చెంచయ్యనాయుడు, కన్నలి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కాపుగున్నేరి సింగిల్‌విండో చైర్మన్‌గా బత్తిరెడ్డి మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే సుధీర్ మాట్లాడుతూ... రైతులకు ఉపయోపడే ప్రతి పనినీ ముందుండి చేయాలని సూచించారు. చెంచయ్యనాయుడు, రవీంద్రారెడ్డి, కామేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి


శ్రీకాళహస్తిలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న విద్యుత్ శాఖ ఉద్యోగులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ శాఖలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు తిరుపతి రూరల్ డివిజన్ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మునస్వామి ఆధ్వర్యంలో మంగళవారం నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మునస్వామి మాట్లాడుతూ... 1999 -2004 మధ్య చేరిన ఉద్యోగులకు పింఛను సదుపాయం కల్పించాలని, జేఎల్‌ఎం గ్రేడ్-2లను క్రమబద్ధీకరించాలని, ఇంజనీరింగ్, డిగ్రీ కలిగిన జూనియర్ ఇంజనీర్లకు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. కారుణ్య నియమాకాలు చేపట్టాలని, కార్మికులకు నేరుగా వేతనాలు చెల్లించాలని, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. నాగేశ్వరరావు, బాబు, మునిసుందరం, గుర్రప్ప, ఆనంద్, లక్ష్మీకాంత్, మల్లికార్జున, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు(ఆంధ్రజ్యోతి): పీఆర్‌సీ కమిటీని వెంటనే ప్రకటించాలని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో చిత్తూరు నుంచి గుంటూరుకు వరకు చేపట్టిన యప్రచార యాత్ర మంగళవారం ఏర్పేడు మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పేడు మండల నాయకులు యాత్రకు సంఘీభావం తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ స్కీంను సద్వినియోగం చేసుకోండి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీంను సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాళహస్తి పురపాలక సంఘం కమిషనర్ భవానిశంకర్ చెప్పారు. ఈ మేరకు ప్లాట్ల క్రమబద్ధీకరణపై మంగళవారం పట్టణవ్యాప్తంగా అవగాహన కల్పించే సమాచార బోర్డులను పురపాలక సిబ్బంది ఏర్పాటు చేశారు. అనధికారిక లేఅవుట్లలో కొనుగోలు చేసిన ప్లాట్ల రెగ్యులరైజ్ చేసుకునేందుకు దరఖాస్తు విధానం, ప్రభుత్వ ప్రోత్సహకాలు, లబ్ధిదారులకు కలిగే ప్రయోజనాలను పట్టికగా రూపొందించారు. ఇతర వివరాల కోసం వార్డు సచివాలయ, పురపాలక సంఘం సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

యూరియా, ఎరువులను అందుబాటులో ఉంచండి


డీలర్లకు సూచనలిస్తున్న ఏడీఏ

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో రబీ సీజన్‌లో రైతులకు యూరియా, ఎరువులను అందుబాటులో ఉంచాలని శ్రీకాహస్తి ఏడీఏ రమేష్‌రెడ్డి ఆదేశించారు. మండల వ్యవసాయ కార్యాలయంలో ఎరువులు, పురుగు మందులు, విత్తనాల డీలర్లతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఎరువుల నిల్వ, గ్రౌండ్ బ్యాలెన్స్, రిజిస్టర్ బ్యాలెన్స్‌లో తేడాలు వస్తే లైసెన్సు రద్దు చేస్తామన్నారు. రైతులకు బయోఫెర్టిలైజర్స్, నానో యూరియా, డీఏపీలపై అవగాహన కల్పించాలని ఏవో షణ్ముగాన్ని ఆదేశించారు. విస్తరణ అధికారి రేవతి పాల్గొన్నారు.

మనసును జయించేవాడు మాధవుడు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మనసుకు దాసుడు మానవుడు.. మనసును జయించేవాడు మాధవుడు అని కాశీవన క్షేత్రం పీఠాధిపతి యోగిని చంద్రకాళీప్రసాద మాతాజీ అన్నారు. పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక ప్రవచనాల్లో అనుగ్రహ భాషణం చేస్తూ గురువు దైవంతో సమానమన్నారు. గురుసారథ్యంలో సాధన చేయాలన్నారు. ఆశ్రమపీఠాధిపతి విద్యాస్వరూపానందగిరిస్వామి ఆమెను సత్కరించారు.

ఆటో బోల్తా: ఆరుగురికి గాయాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడటంతో అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు గాయపడ్డారు. ఈఘటన మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలోని భరద్వాజ తీర్థంలో జరిగింది. నెల్లూరు నగరానికి చెందిన ఆరుగురు శ్రీకాళహస్తి పట్టణం చెంచులక్ష్మికాలనీలోని బంధువుల ఇంటికి వచ్చారు. ఆటోలో భరద్వాజ తీర్థం నుంచి భక్తకన్నప్ప కొండ మార్గంలోని ఫొటోలు దిగే స్థావరం వద్దకు వెళ్తుండగా బ్రేక్ ఫెయిల్ కావడంతో ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో రెహాన, కరీష్మాకు తీవ్రగాయాలయ్యాయి. బాను, జాకీర్, ఆశాబేగం, మహమద్ అలీ స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి తరలించారు.

దొంగ ఓట్లను అరికట్టండి... ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

శ్రీకాళహస్తి,సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): దొంగ ఓట్లను అరికట్టి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి కరీముల్లా కోరారు. దొంగ ఓట్లను అరికట్టండి, ప్రజాస్వామ్యాన్ని కాపాడండి కార్యక్రమంలో భాగంగా పట్టణంలో సంతకాల సేకరణచేశారు. సెప్టెంబరు 15 నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా సంతకాలు సేకరిస్తామని చెప్పారు. సీనియర్ నాయకుడు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం


కేవీబీపురం ప్రధాన రహదారిపై, మోరీస్‌కండ్రిగలో రోడ్డుపై చేరిన మురుగునీరు

కేవీబీపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం పడకే యడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా మురుగునీటి కాలువలు లేకపోవడం, ఉన్నవి పూడిపోవడంతో ఎక్కడి మురుగు అక్కడే తిష్ట వేస్తోంది. దీంతో దుర్గంధంతో పాటు దోమలు వ్యాప్తి పెరిగి జ్వరాల బారిన పడుతున్నారు. కేవీబీపురం పట్టణంలోని సంత మైదానం వద్ద వారధిని పూడ్చి అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో మురుగు వెళ్లే దారి మూసుకుపోయింది. దీంతో ఆ ప్రాంతం మురుగు నీటితో నిండిపోతోంది. అలాగే మిద్దకండ్రిగలో కూడా దాదాపు ఇదే పరిస్థితి. మురుగు సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని మురుగునీటి సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు సాదర వీడ్కోలు



రేణిగుంట సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు సాదర వీడ్కోలు పలికారు. జిల్లాలో మూడు రోజుల పర్యటన ముగించుకుని మంగళవారం మధ్యాహ్నం తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు జేసీ శుభం బన్సల్ సాదరంగా వీడ్కోలు పలికారు. అదనపు ఎస్పీ రవి మనోహరాచారి, డీఎస్పీ శ్రీనివాసరావు, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల సమావేశం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీకాళహస్తి బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమావేశం ఈనెల 17న నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు తీగల వెంకటయ్య తెలిపారు. పాఠశాల స్థాపించి 104 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా 100 వసంతాల పండుగ నిర్వహించాలని పూర్వ విద్యార్థులు కోరుతున్నారని తెలిపారు. ఈ మేరకు అందుబాటులో ఉన్న విద్యార్థులతో బుధవారం సాయంత్రం 5గంటలకు సమావేశం జరుగుతుందన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలకు పదునుపెట్టండి

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాలపై ఉపాధ్యాయులు పదును పెట్టాలని ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం ఆదేశించారు. మండలంలోని నీర్పాకోట గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో సెంకడరీ గ్రేడ్ సబెక్టు విషయ నిపుణలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల సామర్థ్యాల పరిశీలనను అంచనా వేయడానికి అకడమిక్ ఫోరంలు అన్ని పాఠశాలలను సందర్శించనున్నాయని తెలిపారు. ఇటీవల జరిగిన ఎఫ్ఏ-1 పరీక్షలకు సంబంధించి మూల్యాంకనం పుస్తకాలను తనిఖీ చేస్తాయని చెప్పారు.

బీజేపీ నేత మృతికి నివాళులు

పిచ్చాటూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల నేత సురేష్‌రెడ్డి(36)కి పలువురు నివాళులర్పించారు. పార్టీ తరఫున కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పారు. రూ.20 వేలు సాయం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి మునికృష్ణయ్య, మండల అధ్యక్షుడు కుబేంద్రన్, జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రప్ప, రాష్ట్ర మాజీ కార్యదర్శి మునిసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణపై అవగాహన

రేణిగుంట సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినిలకు మట్టి నమూనా సేకరణ, పరీక్షలపై అవగాహన కల్పించారు. నమూనా కోసం మట్టిని ఎలా సేకరించాలో వ్యవసాయ అధికారి సుధా ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పుష్పాంజలి, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వేణుగోపాల్, గ్రామ వ్యవసాయ సహాయకుడు శివకుమార్, పాఠశాల సైన్స్ ఉపాధ్యాయురాలు శిరీష , రాస్ కేవికే సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓవర్ బ్రిడ్జిపై ఆగిన ఆర్టీసీ బస్సు


మరమ్మతులకు గురై ఆగిన బస్సు

రేణిగుంట, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): రాజంపేట నుంచి తిరుపతికి వెళ్తున్న ఏపీఎస్ ఆర్టీసీ బస్సు మరమ్మతులకు గురై రేణిగుంట ఓవర్ బ్రిడ్జిపై ఆగిపోయింది. క్లచ్ పనిచేయక పోవడంతో ఆగిపోయింది. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులను వేరే ఆర్టీసీ బస్సులో తిరుపతికి తరలించారు.